గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 225, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, సోమవారం - 23 - సెప్టెంబర్ - 2024
PUBLISHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# కూటమి హండ్రెడ్ డేస్ : జగన్ కి బాబు రిటర్న్ గిఫ్ట్

## వైసీపీ బ్యాన్ జగన్ బ్యాన్ అంటూ టీడీపీ

- బాబు ఈ వందవ రోజున ప్రతిపక్ష వైసీపీకి అతి పెద్ద షాక్ ట్రీట్మెంట్ ఇచ్చేశారు
- వైసీపీ అయిదేళ్ళ పాలన నిర్వాకం ఉందని కూడా బాబు సహా అంతా ఆరోపించారు
- ప్రసాదంతో అపచారం చేసింది వైసీపీ అని నమ్మే వారు అంతా పెద్ద ఎత్తున నమ్ముతున్నారు
- వైసీపీని జనంలో విలన్ గా ముందు పెట్టడంలో బాబు సక్సెస్
- ఆ పార్టీని ఒక ప్రధాన వర్గానికి దూరం చేసే రాజకీయం స్టార్ట్ అయిందా అన్న చర్చ

వివరాలు 2లో..



అమరావతి: తెలుగుదేశం కూటమి వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా భారీ ఎత్తున ప్రచారం చేసుకుంటారని ప్రజల వద్దకు వెళ్ళి తాము చేసిన కార్యక్రమాల గురించి చెబుతారని అంతా అనుకున్నారు. అదే జరుగుతోంది కూడా. అయితే బాబు ఈ వందవ రోజున ప్రతిపక్ష వైసీపీకి అతి పెద్ద షాక్ ట్రీట్మెంట్ ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి అనేక రకాలైన శ్వేత పత్రాలు విడుదల చేసి వైసీపీ అయిదేళ్ల పాలనలో ఏపీ ఎంతలా భ్రష్టు పట్టిపోయిందో మీడియా ముఖంగా బాబు చాటు చెప్పారు. మిగతా..2లో

# ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ లేఖ



- తిరుమల లడ్డూ వ్యవహారంలో గత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- వాస్తవాలు వెలికితీయాలంటూ ప్రధాని మోదీని కోరిన జగన్
- కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని వెల్లడి
- సున్నితమైన అంశాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని విమర్శలు

అమరావతి: తిరుమల లడ్డూ వ్యవ హారంలో తమపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. శ్రీవారి లడ్డూ కల్తీ అంశంలో నిజానిజాలు మిగతా..2లో

# 15 రోజుల తర్వాత మళ్లీ వస్తాం... నల్ల చెరువు ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు

- నివాస సముదాయాలకు గడువు ఇచ్చిన హైడ్రా
- ఆదివారం 16 షెడ్లను కూల్చివేసిన అధికారులు
- నల్ల చెరువులో 14 ఎకరాల మేర కబ్జా జరిగినట్లు గుర్తింపు




# ఇరాన్ బొగ్గు గనిలో పేలుడు.. 30 మంది కార్మికులు దుర్మరణం



- మీథేన్ గ్యాస్ లీక్ కారణంగా పేలుడు
- 17 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మరికొంత మంది కార్మికులు లోపల చిక్కుకుపోయినట్లు సమాచారం


# హెచ్ఐవీకి టీకా వచ్చేసింది.. వారం వ్యవధిలో రెండు డోసులు

హైదరాబాద్,: ప్రపంచ వ్యాప్తంగా ఏటా పది లక్షల మంది హెచ్ ఐవీ మహ మ్మారి బారిన పడుతున్నారు. వేలాది మంది మరణి స్తున్నారు. రోగ నిరోధక శక్తికి దొరకకుండా హెచ్ఐవీ మిగతా..2లో




## గన్నులతో వచ్చి కెమెరాలు తీసుకుని వెళ్లిపొమ్మన్నారు..

# ఆల్ జజీరా ఆఫీసులో ఇజ్రాయెల్ సోల్జర్ల దాడి




- గతంలోనే ఆల్ జజీరాపై బ్యాన్ విధించిన ఇజ్రాయెల్
- తాజాగా వెస్ట్ బ్యాంక్ లోని ఆఫీసులోకి చొచ్చుకెళ్లిన సోల్జర్లు
- వెంటనే ఆఫీసు ఖాళీ చేయాలని జర్నలిస్టులకు ఆదేశం

ఢిల్లీ: గాజాలో హమాస్ తో, లెబనాన్ లో హిజ్బుల్లా ఉగ్ర వాదు లతో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ తాజాగా వెస్ట్ బ్యాంక్ లో మిగతా..2లో


# శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ఫలితాలు.. తదుపరి అధ్యక్షుడిగా దిస్సనాయకే!




ఢిల్లీ : శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఇప్పటి వరకు విడుదలైన ట్రెండ్స్ ప్రకారం నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) నేత అనుర కుమార దిస్సనాయకే (55) ముందంజలో ఉన్నారు.

# తెలుగు ప్రజలకు బ్యాడ్ న్యూస్.. హైరిస్క్ జోన్ లో తెలుగు రాష్ట్రాలు

## తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావాలని కోరారు



- ఒక కార్యక్రమంలో భారత వాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజే రమేశ్ కీలక వ్యాఖ్యలు
- తెలుగు రాష్ట్రాలు హైరిస్కు జోన్ లో ఉన్న విషయాన్ని వెల్లడి
- మూడు నాలుగు స్థానాల్లో మహారాష్ట్ర.. కర్ణాటకలు ఉండగా.. ఐదో రాష్ట్రంగా బిహార్ నిలిచింది



అమరావతి : నిజంగానే తెలుగు ప్రజలకు బ్యాడ్ న్యూస్ గా దీన్ని చెప్పాలి. వాతా వరణంలోచోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలు హైరిస్కు జోన్ లోకి వచ్చాయని చెబుతున్నారు. దీని కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదలు.. కరువు లాంటి విపత్తులు ఎదుర్కొంటాయని.. అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని హెచ్చరిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా వర్సిటీలో జరిగిన మిగతా..2లో

# ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్

- నంబూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్షకు శ్రీకారం
- 11 రోజుల పాటు కొనసాగనున్న దీక్ష
- అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న పవన్ కల్యాణ్
- ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్ కళ్యాణ్.. 11 రోజుల పాటు దీక్ష చేయనున్న ఏపీ డిప్యూటీ సీఎం..



అమరావతి: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ అయ్యిందంటూ ఈ దీక్ష చేపట్టారు. ఆదివారం ఉదయం గుంటూరు జిల్లా నంబూరు దశావతార వెంకటేశ్వర స్వామి టెంపుల్‌లో ప్రత్యేక పూజలు చేసి దీక్షకు దిగారు. మిగతా..2లో

కళ్యాణ్. అమృతతుల్యంగా, పరమపవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైందని, జంతు అవశేషాలతో మలీనమైందని, విశృంఖల మనస్కులే ఇలాంటి పాపానికి ఒడిగట్టగలరని అన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం తన మనసు కలత చెందిందని. ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందేనని. అందులో భాగంగా ఈరోజు నుంచి ప్రాయశ్చిత్త దీక్ష చేయాలని సంకల్పించానన్నారు

## ఇప్పటికే రెండు బిగ్ టాస్క్‌లను ఎదుర్కొన్న కాంగ్రెస్..




ఇక.. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం.. ఆయనకు పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా పార్టీ జీవం పోసుకుంది. అనూహ్యంగా పార్టీ ఊపందుకుంది. పార్టీలో రేవంత్ రెడ్డి కీ రోల్ పోషిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. ప్రతీ అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు. రాష్ట్రమంతటా పర్యటించారు.

# మరో పరీక్షకు సిద్ధమైన కాంగ్రెస్..

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేనా..? బీసీ రిజర్వేషన్ కలిసొచ్చేనా..?

- ప్రత్యేక రాష్ట్రం సాధించిన పేరుతో రెండు సార్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే కొలువుదీరింది
- పార్టీలోని ముఖ్యనేతలు, కింది స్థాయి నేతలు సైతం పార్టీని వీడి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయారు
- అటు ఢిల్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులను తీసుకొచ్చి వారితో ప్రచారం చేయించారు
- ప్రతీ జిల్లాల్లోనూ మెజార్టీ స్థానాల్లో వన్ సైడ్ తీర్పు వచ్చింది
- అధికారిక హోదాలో మరో ఎన్నికల టాస్క్‌ను ఎదుర్కోబోతోంది

హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తదుపరి ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ గడ్డు పరిస్థి తులను చవిచూసింది. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినప్పటికీ తెలంగాణలోనూ ఆ పార్టీ ప్రభావం పూర్తిగా కోల్పోయింది. ప్రత్యేక రాష్ట్రం సాధించిన పేరుతో రెండు సార్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే కొలువుదీరింది. దాంతో ఆ పదేళ్లు కూడా కాంగ్రెస్ పార్టీ పేరు కూడా వినిపించకుండా పోయింది. పార్టీలోని ముఖ్యనేతలు, కింది స్థాయి నేతలు సైతం పార్టీని వీడి మిగతా..2లో

# దేశవ్యాప్తంగా రైళ్ల పేల్చివేతకు కుట్ర..




## మధ్యప్రదేశ్‌లోని రైల్ ట్రాక్‌పై 10 డిటనేటర్ల గుర్తింపు..!

- ట్రాక్‌పై డిటనేటర్లను గమనించిన లోక్ పైలట్ వెంటనే రైలును ఆపేయడంతో ప్రమాదం తప్పింది
- ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదని రైల్వే అధికారులు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా రైళ్ల పేల్చివేత కుట్ర మరోసారి బయటపడింది. మధ్యప్రదేశ్ లోని సగ్‌పాటా రైల్వేస్టేషన్ దగ్గర ట్రాక్‌పై 10 డిటనేటర్లు మిగతా..2లో

# అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా..




వివరాలు 2లో..

- నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్
- మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు
- టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటా మాత్రమే ఇచ్చారు

హైదరాబాద్: అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.

# తెలుగు ప్రజలకు బ్యాడ్ న్యూస్.. హైరిస్కు జోన్ లో తెలుగు రాష్ట్రాలు

మొదటి పేజి తరువాయి

ఒక కార్యక్రమంలో భారతవాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజే రమేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు.దేశంలోనివాతావరణ పరిస్థితులపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వాతావరణ పరిస్థితులకు సంబంధించి తెలుగు రాష్ట్రాలు హైరిస్కు జోన్ లో ఉన్న విషయాన్ని వెల్లడించారు. ఈ క్రమంలో హైరిస్కు జోన్ లో అసోం మొదటి స్థానంలో ఉండగా..రెండో స్థానంలో రెండు తెలుగు రాష్ట్రాలు ఉండటం గమనార్హం. మూడు నాలుగు స్థానాల్లో మహారాష్ట్ర.. కర్ణాటకలు ఉండగా.. ఐదో రాష్ట్రంగా బిహార్ నిలిచింది. వాతావరణ మార్పులతో 2000 నుంచి విపత్తుల తీవ్రత పెరుగుతూ వస్తోంది. తెలంగాణలో ఉత్తర..తూర్పుప్రాంతంలో వర్షపాతం పెరుగుతోందని.. తూర్పు తెలంగాణలోని వరంగల్.. ఖమ్మం జిల్లాల్లో వర్షపాతం పెరగటంతో విజయవాడ.. క్రిష్ణా.. ఏలూరు ప్రాంతాలకు వరద పోటు ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వరదలు.. కరువు.. తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం.. విజయనగరం.. ఉభయ గోదావరి.. క్రిష్ణా.. గుంటూరు.. ప్రకాశం.. నెల్లూరు.. కడప జిల్లాలు ఎక్కువగా ప్రభావితం కానున్నట్లు పేర్కొనటం గమనార్హం. ఇప్పటితో పోలిస్తే భవిష్యత్తులో విపత్తుల తీవ్రత మరింత ఎక్కువ అవుతుందన్న ఆయన కీలక సూచన చేవారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రెయిన్ గేజ్ స్టేషన్ల వద్ద ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకొని.. తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావాలని కోరారు.

# ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ లేఖ

మొదటి పేజి తరువాయి

వెలికితీయాలని తన లేఖలో కోరారు. చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నాడంటూ ఆరోపించారు. 100 రోజుల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ వివాదంతో కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, తిరుమల సంప్రదాయాలపై అపోహలు పెంచే విధంగా ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఇది ఎంతో సున్నితమైన అంశం అని, దీన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని జగన్ తన లేఖలో విమర్శించారు. చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం ముఖ్యమంత్రి పదవికి అప్రదిష్ఠ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రధాని మోదీని కోరారు.

# 15 రోజుల తర్వాత మళ్లీ వస్తాం... నల్ల చెరువు ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు

హైదరబాద్: కూకట్ పల్లిలోని నల్ల చెరువును ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న వారికి హైడ్రా అధికారులు 15 రోజుల గడువుతో నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసేలోగా ఖాళీ చేసి వెళ్లాలని, ఆ తర్వాత ఇళ్లను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం నాడు నల్ల చెరువులోని ఆక్రమణలను హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. అక్కడున్న వ్యాపార సముదాయాలను శనివారం ఖాళీ చేయించిన అధికారులు... ఆదివారం ఉదయం నుంచే బుల్డోజర్లతో తొలగింపు చేపట్టారు. మొత్తం 16 షెడ్లను నేలమట్టం చేశారు. నివాస సముదాయాల కూల్చివేతను తాత్కాలికంగా ఆపారు. అక్కడ ఉంటున్న వారికి 15 రోజులు గడువు ఇచ్చారు. ఆలోగా ఆక్రమణలను తొలగించాలని చెప్పారు. గడువు ముగిసినా అలాగే ఉంటే మాత్రం తామే కూల్చివేస్తామని తేల్చిచెప్పారు. నల్ల చెరువు మొత్తం విస్తీర్ణం 27 ఎకరాలు కాగా, 14 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. శుక్రవారం సర్వే నిర్వహించిన హైడ్రా అధికారులు శనివారం రాత్రి షెడ్లలో నివాసితులను ఖాళీ చేయించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే జేసీబీ, బుల్డోజర్లతో భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు.

బాధితుల కన్నీళ్లు...

కూకట్ పల్లి నల్ల చెరువు ఆక్రమణల తొలగింపు సందర్భంగా బాధితులు కంటతడి పెడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తమకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని హైడ్రా అధికారులపై బాధితులు మండిపడుతున్నారు. ఇంట్లోని విలువైన సామాన్లు కూడా తీసుకోనివ్వలేదని, పోలీసులతో తమను అడ్డుకున్నారని వాపోయారు. సంవత్సరాల తరబడి నివాసం ఉన్న షెడ్లను కళ్ల ముందే కూల్చేస్తుంటే బాధితులు కన్నీరు పెట్టడం చూపరులను కలచివేసింది. రెక్కల కష్టంతో తినీతినకా పొదుపు చేసిన సొమ్ముతో ఓ గూడు ఏర్పరుచుకున్నామని, ఇప్పుడు అధికారులు దానిని కూల్చేస్తున్నారని బాధితులు రోదిస్తూనే మీడియాతో చెప్పారు.

# ఇరాన్ బొగ్గు గనిలో పేలుడు.. 30 మంది కార్మికులు దుర్మరణం

ఢిల్లీ : ఇరాన్ లోని ఓ బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించింది. శనివారం అర్ధరాత్రి ప్రాంతంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. దీంతో లోపల పనిచేస్తున్న కార్మికులలో 30 మంది చనిపోయారు. మరో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్న అధికారులు.. గాయపడ్డ కార్మికులను స్థానిక ఆసుపత్రులకు తరలించారు. బొగ్గు గని టన్నెల్ లో కార్మికులు పనిచేస్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని సమాచారం. మీథేన్ గ్యాస్ లీక్ కావడమే పేలుడుకు దారి తీసిందని గాయపడ్డ కార్మికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గనిలో పెద్ద సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. మరికొంతమంది కార్మికులు లోపల చిక్కుకుపోయారని అనుమానం వ్యక్తం చేశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, లోపల చిక్కుకున్న కార్మికులను క్షేమంగా బయటకు తీసుకొస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన బొగ్గు గని ఇరాన్ రాజధానికి సుమారు 540 కిలోమీటర్ల దూరంలోని తబాస్ లో ఉంది. కాగా, ఇరాన్ లో గతంలోనూ బొగ్గు గని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2017లో ఓ బొగ్గు గనిలో జరిగిన పేలుడుకు 42 మంది కార్మికులు బలయ్యారు. 2013లో రెండు గనులలో జరిగిన ప్రమాదాలలో 11 మంది, 2009లో జరిగిన మరో ప్రమాదంలో 20 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

# హెచ్ఐవీకి టీకా వచ్చేసింది.. వారం వ్యవధిలో రెండు డోసులు

మొదటి పేజి తరువాయి


వైరస్ తరచూ మ్యుటేషన్‌కు లోనవుతుండటంతో ఈ వ్యాధిని నయం చేయడం కుదరట్లేదు. శక్తిమంతమైన ఔషధాలు, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఏడు వ్యాక్సిన్ డోసులతో ప్రభావం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. దీంతో అమెరికాలోని ఎంఐటీ పరిశోధకులు హెచ్ఐవీ నియంత్రణకు ఓ టీకాను అభివృద్ధి చేశారు.

వారం వ్యవధిలో రెండు డోసులు

హెచ్ఐవీ నియంత్రణ కోసం ఈ టీకాను వారం వ్యవధిలో రెండు మోతాదులుగా ఇస్తారు. తొలి డోసులో 20 శాతం వ్యాక్సిన్‌ను, రెండో డోసులో 80 శాతం వ్యాక్సిన్‌ను రోగికి వేస్తారు. స్వల్ప వ్యవధిలో ఇచ్చే ఈ రెండు డోసులతో వైరస్ మ్యుటేషన్ జరిగేలోగా టీకా తన పనిని చేస్తుందని, రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజితం చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు వెల్లడించారు. 'ఇంట్రెస్టింగ్ ఇంజినీరింగ్' ఈ వివరాలను వెల్లడించింది.

# దేశవ్యాప్తంగా రైళ్ల పేల్చివేతకు కుట్ర...

మొదటి పేజి తరువాయి




లభించడం తీవ్ర కలకలం రేపింది. జమ్ము కశ్మీర్ నుంచి కర్నాటకకు వస్తున్న ఆర్మీ ట్రైన్‌కు పెను ముప్పు తప్పింది. ట్రాక్‌పై డిటనేటర్లను గమనించిన లోక్ పైలట్ వెంటనే రైలును ఆపేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదని రైల్వే అధికారులు ప్రకటించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ సమీపంలో మరో ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్‌ను చూసిన గూడ్సు రైలు డ్రైవర్ వెంటనే ఆపేశాడు.. కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఈ గూడ్స్ రైలు వెళ్తుండగా ప్రమాదం తప్పింది. ఇదిలావుండగా, ఉత్తరప్రదేశ్ నెలరోజుల్లో రెండోసారి ఇలాంటి ఘటన వెలుగు లోకి వచ్చింది. కొద్దిరోజుల క్రితమే బివాని నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న రైలుకు పెనుప్రమాదం తప్పింది. ట్రాక్‌పై సిలిండర్ ఉండడంతో ట్రైన్‌ను ఆపేశాడు కాళింది ఎక్స్‌ప్రెస్ డ్రైవర్. ఇక ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాలో రైలు ప్రమాదానికి పన్నిన కుట్ర భగ్నమైంది. ఉత్తరాఖండ్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న బల్వంత్ ఎన్‌క్లేవ్ కాలనీ వెనుక నైనీ జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణిస్తున్న ట్రాక్‌పై పాత 7 మీటర్ల పొడవైన టెలికాం స్తంభాన్ని ఉంచారు దుండగులు. ఇంతలో డెహ్రాడూన్ (దూన్) ఎక్స్‌ప్రెస్ అక్కడి నుండి వెళుతోంది. రైల్వే ట్రాక్‌పై స్తంభాన్ని చూసిన రైలు లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పిందిదం తప్పిం. రైల్వే ట్రాక్‌పై స్తంభం ఉన్నట్టు సమాచారం అందుకున్న జీఆర్పీ, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాక్‌పై ఉన్న పిల్లర్‌ను అధికారులు తొలగించారు. ఆ తర్వాత రైలు ముందుకు సాగింది. అంతకుముందు ఘాజీపూర్‌లో రైల్వే ట్రాక్‌పై పెద్ద చెక్క దిమ్మెను ఉంచారు. ఫ్రీడమ్ ఫైటర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌ను ఢీకొట్టింది. అయితే రైలు పట్టాలు తప్పకుండా లోకో పైలట్ కాపాడారు. ఈ వరుస ఘటనలతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైళ్ల పేల్చివేత కుట్రలపై యన్ఐఎ దర్యాప్తు చేపట్టింది.

# కూటమి హండ్రెడ్ డేస్ :జగన్ కి బాబు రిటర్న్ గిఫ్ట్

మొదటి పేజి తరువాయి



అంతే కాదు ఏపీలో ఇటీవల సంభవించిన భారీ వరదలతో బెజవాడ మునిగింది. దాంతో బుడమేరు చుట్టూ ఆక్రమణలు జరిగాయని దానికి వైసీపీ ప్రభుత్వమే కారణం అని కూడా కూటమి పెద్దలు ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అచ్యుతాపురంలోని ఒక సెజ్ లో జరిగిన పేలుడు ఘటన వెనక కూడా వైసీపీ అయిదేళ్ళ పాలన నిర్వాకం ఉందని కూడా బాబు సహా అంతా ఆరోపించారు. ఇలా ఈ వంద రోజులలో వైసీపీ కూటమి వందకు వంద తప్పులను ఎత్తి చూపడంతో టీడీపీ కూటమి సర్కార్ పూర్తిగా సక్సెస్ అయింది. దానిని పీక్స్ కి తీసుకుని వెళ్ళేలా వైసీపీ చేసిన వందవ తప్పు ఇదని అంటూ లడ్డూ ప్రసాదంతో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నూనెను వాడారని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన ప్రకటన మాత్రం ఏకంగా ఏపీనే కాదు ప్రపంచాన్నే కుదిపేసింది. ఎక్కడ చూసినా తిరుపతి లడ్డూ గురించే చర్చించుకోవడం జరుగుతోంది. మొదట్లో దీని సీరియస్ నెస్ తెలియక వైసీపీ కొంత లైట్ తీసుకున్నా కూడా ఆ తరువాత వేగంగా రియాక్ట్ అయింది. హైకోర్టులో పిటిషన్ వేయడం ద్వారా సమగ్రమైన విచారణను ఈ ఘటన మీద జరిపించాలని కోరడం వైసీపీ తెలివైన ఆలోచనగానే చూడాలి. అదే టైం లో దేశ ప్రధాని నరేంద్ర మోడీకి అలాగే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కి లేఖ రాసి విచారణ కోరుతామని జగన్ ప్రకటించారు. అయితే వాటి సంగతి అలా ఉంటే గత నాలుగు రోజులుగా వైసీపీ బ్యాన్ జగన్ బ్యాన్ అంటూ టీడీపీ అనుకూల మీడియాలో పెద్ద ఎత్తున చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీని డైరెక్ట్ గా టార్గెట్ చేస్తున్నారు. లడ్డూ ప్రసాదంతో అపచారం చేసింది వైసీపీ అని నమ్మే వారు అంతా పెద్ద ఎత్తున నమ్ముతున్నారు. దీంతో వైసీపీ ఇరకాటంలో పడుతోంది. ఇక జగన్ స్వతహాగా క్రిస్టియన్ కావడంతో కూడా ఈ వివాదంలో అగ్గి రాజుకోవడం, వైసీపీ మీద అన్ని వేళ్ళూ చూపించడానికి కారణం అవుతోంది. దానికి తోడు వైసీపీ అయిదేళ్ళ పాలనలో ఆలయాల విధ్వంసం వంటివి చోటు చేసుకోవడంతో ఆ పార్టీని ఒక ప్రధాన వర్గానికి దూరం చేసే రాజకీయం స్టార్ట్ అయిందా అన్న చర్చ సాగుతోంది. వైసీపీకి ఇది కఠినమైన అగ్ని పరీక్షగానే అంటున్నారు. వైసీపీ ఇపుడు దీని నుంచి ఎలా బయటపడాలని చూస్తోంది. ఒక విధంగా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. పూర్తి స్థాయి విచారణ జరిగి అసలు నిజాలు బయటకు వస్తే అప్పటి సంగతేమో కానీ ప్రస్తుతానికి అయితే వైసీపీని జనంలో విలన్ గా ముందు పెట్టడంలో బాబు సక్సెస్ అయ్యారు అని అంటున్నారు. ఆ విధంగా బాబు హండ్రెడ్ డేస్ కూటమి సెలబ్రేషన్స్ లో జగన్ కి ఇచ్చిన పవర్ ఫుల్ రిటర్న్ గిఫ్ట్ అని అంటున్నారు. సెంటిమెంట్ దెబ్బతో వైసీపీని కార్నర్ చేసేసారు. దీని నుండి విప్పుకుని బయటపడడం అన్నది వైసీపీకి ఇపుడు కత్తి మీద సాముగా ఉంది. వైసీపీ ఆత్మ రక్షణలో పడిపోయింది. ఎలా ముందుకు వెళ్ళాలి అన్నది ఆ పార్టీలో అంతర్మధనం సాగుతోంది. ఏది ఏమైనా చంద్రబాబు అపర చాణక్యుడు అన్నది మరో మారు రుజువు అయింది. తనను ఏడాది క్రితం సెప్టెంబర్ నెలలో జైలులో పెట్టించిన జగన్ కి అదే సెప్టెంబర్ నెలలో కోలుకోలేని విధంగా రాజకీయ దెబ్బ తీశారు అని అంటున్నారు. చూడాలి మరి దీని ఫలితాలు పర్యవసానాలు ఎలా ఉంటాయో. దీనికి లాజికల్ ఎండ్ ఎలా పడుతుందో కూడా చూడాలి.

# ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్

మొదటి పేజి తరువాయి



అంతకు ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 11 రోజుల దీక్ష అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించు కుంటారు పవన్. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ తాను ప్రాయశ్చిత దీక్ష చేపడుతున్నట్లు శనివారం ప్రకటించారు పవన్ కళ్యాణ్. అమృతతుల్యంగా, పరమపవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైందని, జంతు అవశేషాలతో మలీనమైందని, విశృంఖల మనస్కులే ఇలాంటి పాపానికి ఒడిగట్టగలరని అన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం తన మనసు కలత చెందిందని. ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందేనని. అందులో భాగంగా ఈరోజు నుంచి ప్రాయశ్చిత్త దీక్ష చేయాలని సంకల్పించానని అన్నారు పవన్ కళ్యాణ్.

"ఏడుకొండలవాడా..! క్షమించు.. 11 రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష

అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డు ప్రసాదం- గత పాలకులు వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైంది. జంతు అవశేషాలతో మాలిన్యమైంది. విశృంఖల మనస్కులే ఇటువంటి పాపానికి ఒడిగట్టగలరు. ఈ పాపాన్ని ఆదిలోనే పసిగట్టలేకపోవడం హైందవ జాతికే కళంకం. లడ్డు ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం నా మనసు వికలమైంది. అపరాధ భావానికి గురైంది. ప్రజా క్షేమాన్ని కాంక్షించి పోరాటంలో ఉన్న నాకు ఇటువంటి క్లేశం ఆదిలోనే నా దృష్టికి రాకపోవడం బాధించింది. కలియుగ దైవమైన బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందే. అందులో భాగంగా నేను ప్రాయశ్చిత్త దీక్ష చేయాలని సంకల్పించాను. 22 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష చేపడతాను. 11 రోజులపాటు దీక్ష కొనసాగించి అనంతరం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటాను. 'దేవదేవా%ూ% నీ పట్ల గత పాలకులు చేసిన పాపాలను ప్రక్షాళన చేసే శక్తిని ఇవ్వమ'ని వేడుకుంటాను. భగవంతుడిపై విశ్వాసం, పాప భీతి లేనివారే ఇటువంటి అకృత్యాలకు ఒడిగడతారు. నా బాధేమిటంటే- తిరుమల తిరుపతి దేవస్థానం అనే వ్యవస్థలో భాగమైన బోర్డు సభ్యులు, ఉద్యోగులు సైతం అక్కడి తప్పిదాలను కనిపెట్టలేకపోవడం, కనిపెట్టినా నోరు మెదపకపోవడం. నాటి రాక్షస పాలకులకు భయపడి మిన్నకుండిపోయారా అనిపిస్తోంది. వైకుంఠ ధామంగా భావించే తిరుమల పవిత్రతకు, వేదాచారాలకు, ధార్మిక విధులకు కళంకం తెచ్చే విధంగా పెడపోకడలకు పాల్పడిన గత పాలకుల తీరు హిందూ ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరినీ బాధించింది. ఇక లడ్డు ప్రసాదం తయారీలో జంతు అవశేషాలు ఉన్న నెయ్యిని వినియోగించారనే విషయం తీవ్ర క్షోభకు గురి చేసింది. ధర్మాన్ని పునరుద్ధరించుకొనే దిశగా అడుగులు వేసే తరుణం ఆసన్నమైంది.

ధర్మో రక్షతి రక్షితః" అంటూ ట్వీట్ చేశారు.

# మరో పరీక్షకు సిద్ధమైన కాంగ్రెస్.. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేనా..?బీసీ రిజర్వేషన్ కలిసొచ్చేనా..?

మొదటి పేజి తరువాయి



ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయారు. దాంతో ఉన్న కేడర్‌లో రోజురోజుకూ మనోస్థైర్యం దెబ్బతింది. అలా.. రెండు టర్మ్‌ల ఎన్నికల్లోనూ పార్టీకి పరాభావం తప్పలేదు. ఇక.. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం.. ఆయనకు పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా పార్టీ జీవం పోసుకుంది. అనూహ్యంగా పార్టీ ఊపందుకుంది. పార్టీలో రేవంత్ రెడ్డి కీ రోల్ పోషిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. ప్రతీ అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు. రాష్ట్రమంతటా పర్యటించారు. అటు ఢిల్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులను తీసుకొచ్చి వారితో ప్రచారం చేయించారు. ఫైనల్‌గా ఫలితం సాధించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ పార్టీ అటు పార్లమెంట్ ఎన్నికల్లో హవా కొనసాగించింది. 8 పార్లమెంట్ స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చని ఊపు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి కలిసొచ్చిందని చెప్పొచ్చు. అయితే.. ఇప్పటికే రెండు బిగ్ టాస్క్‌లను ఎదుర్కొన్న కాంగ్రెస్.. ఇప్పుడు అధికారిక హోదాలో మరో ఎన్నికల టాస్క్‌ను ఎదుర్కోబోతోంది. అవే స్థానిక సంస్థల ఎన్నికలు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద టాస్క్ కాబోతున్నాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతీ జిల్లాల్లోనూ మెజార్టీ స్థానాల్లో వన్ సైడ్ తీర్పు వచ్చింది. చాలా పంచాయతీలపై గులాబీ జెండాలే రెపరెపలాడాయి. ఇంకా.. వందల సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అవి కూడా బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. అయితే.. గతంలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దగా ప్రభావం చూపిన దాఖలాలు లేవు. ఇప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంతో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందా..? లేదా..? అనే చర్చ జోరుగా సాగుతోంది. లోకల్ బాడీస్ ఎన్నికల్లో ఆ పార్టీ సత్తా చాటితేనే పార్టీకి మరింత బలం పెరుగుతుందనే టాక్ వినిపిస్తోంది. అయితే.. అసెంబ్లీ ఎన్నికల వేళ బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఆ పార్టీ చెప్పింది. తన మేనిఫెస్టోలోనూ పొందుపరిచింది. కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాల సమయం ముగిసింది. గత జనవరి 31తోనే సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దాంతో అప్పటి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు బీసీ రిజర్వేషన్ అమలు చేశాకే స్థానిక సంస్థలు నిర్వహించాలని అటు ప్రతిపక్షాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. ఇటు ప్రభుత్వం పెద్దలు కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలకు పోతామని చెప్పారు. అయితే.. బీసీ రిజర్వేషన్లు అమలైతే రాష్ట్రంలో బీసీలకు స్థానాలు పెరుగుతాయి. బీసీ రిజర్వ్‌డ్ సంఖ్య పెరుగుతుంది. దాంతో ఈ రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీకి ఏ మేరకు కలిసి వస్తుందా..? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ రిజర్వేషన్లను ఆ పార్టీ ఏ మేరకు సద్వినియోగం చేసుకొని.. ఏ మేరకు ఫలితాలు సాధిస్తుందా..? అని జోరుగా చర్చ నడుస్తోంది.

# అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా..

మొదటి పేజి తరువాయి

వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఎం జరగలేదు అంటే.. తాను రాజకీయ సన్యాసం చేస్తా. హైకోర్టు సీజే దగ్గరికి రాడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉంది అంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నానని.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ అన్నారు. పదేండ్లలో సింగరేణి లాభాలు గణనీయంగా పెరిగాయన్నారు. లాభాల్లో కార్మికుల వాటా పెంచుకుంటూ వచ్చామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పది పైసల వాటా మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటా మాత్రమే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో 11 పైసల నుంచి 20 పైసల వరకు మాత్రమే ఇచ్చారన్నారు. 1999 నుంచి 2014 వరకు కేవలం రూ.376 కోట్లు మాత్రమే సింగరేణి కార్మకులకు ఇచ్చారు. కాంగ్రెస్ పాలనతో లాభాలు ఎన్నడూ రూ.400 కోట్లు దాటలేదు. లాభాలను వెయ్యి కోట్లు దాటించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. తొమ్మిదిన్నరేండ్లలో తాము రూ.2,780 కోట్లు ఇచ్చామని చెప్పారు 2022-23లో సింగరేణి లాభాల్లో కార్మికులకు 32 శాతం వాటా ఇచ్చాం. సగటున ఒక్కో కార్మికుడికి రూ.లక్షా 60 వేలు చెల్లించాం. సింగరేణిని, కార్మికులను ముఖ్యమంత్రి వెన్నుపోటు పొడుస్తున్నడు. కార్మికుల రెక్కల కష్టాన్ని కాంగ్రెస్ సర్కార్ దోచుకుంటున్నది. 33 శాతం వాటా ఇస్తున్నామని సీఎం తప్పుడు ప్రకటనలు చేస్తున్నడు. సింగరేణి లాభాలు రూ.4701 కోట్లు అయితే 33 శాతం వాటా ఇచ్చామంటున్నారు. కార్మికులకు రూ.1551 కోట్లు బోనస్ ఇవ్వాలి. ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షలు రావి. కానీ రూ.లక్షా 90 వేలు మాత్రమే ఇస్తున్నరు. 16 శాతం మాత్రమే ఇస్తున్నామని కాంగ్రెస్ ఒప్పుకోవాలి. సింగరేణి కార్మికులను మోసం చేయకండి. స్పష్టంగా చెప్పండి' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు మీరిచ్చేది ఇదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై సీపీఐ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడకపోతే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారన్నారు. ఈ కుట్రను కార్మికులు గుర్తించాలన్నారు. తాము చెప్పినదాంట్లో తప్పుంటే ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

# గన్నులతో వచ్చి కెమెరాలు తీసుకుని వెళ్లిపొమ్మన్నారు.. ఆల్ జజీరా ఆఫీసులో ఇజ్రాయెల్ సోల్జర్ల దాడి

మొదటి పేజి తరువాయి




ఓ మీడియా సంస్థపై దాడి చేసింది. భారీగా ఆయుధాలు ధరించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) సైనికులు ఆల్ జజీరా ఆఫీసులోకి చొచ్చుకెళ్లారు. అక్కడున్న జర్నలిస్టులను కెమెరాలు తీసుకుని ఉన్నఫళంగా ఆఫీసును ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇదంతా ప్రత్యక్ష ప్రసారం జరుగు తున్నప్పటికీ వారు వెనకాడలేదు. ముఖానికి మాస్క్ తగిలించుకున్న సైనికులు ఆయుధాలతో తమను బెదిరించి ఖాళీ చేయించారని ఆల్ జజీరా సిబ్బంది వాపోయారు. ఈ సందర్భంగా ఓ సైనికుడు చెప్పిన మాటలను ఆల్ జజీరా జర్నలిస్టులు లైవ్ లో వెల్లడించారు. 45 రోజుల్లోగా ఆల్ జజీరా ఆఫీసును క్లోజ్ చేయాలంటూ కోర్టు ఆదేశించిందని గుర్తుచేస్తూ.. ఇక్కడున్న వారంతా కెమెరాలన్నీ తీసుకుని బయటకు వెళ్లిపోవాలని సదరు సైనికుడు అరబిక్ లో చెప్పాడన్నారు. కాగా, జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించిందంటూ తమ దేశంలో ఆల్ జజీరా మీడియా సంస్థను ఇజ్రాయెల్ గతంలోనే బ్యాన్ చేసింది. గత మే నెలలో జెరూసలెంలోని ఓ హోటల్ లో నిర్వహిస్తున్న ఆల్ జజీరా ఆఫీసుపైనా ఇజ్రాయెల్ అధికారులు దాడి చేశారు. ఇటీవల గాజాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులలో ఆల్ జజీరా జర్నలిస్టు ఇస్మాయిల్ అల్ గౌహల్ మరణించారు. అయితే, అక్టోబర్ 7న ఇజ్రాయెల్ గాజా సరిహద్దుల్లో హమాస్ ఉగ్రవాదులు జరిపిన మారణహోమంలో ఇస్మాయిల్ కూడా పాలుపంచుకున్నాడని ఇజ్రాయెల్ మిలటరీ ఆరోపిస్తోంది. హమాస్ ఆదేశాలతో ఆ ఉగ్రవాద సంస్థకు చెందిన నుఖుబా యూనిట్ అక్టోబర్ 7 దాడికి పాల్పడిందని, ఇస్మాయిల్ కూడా ఈ యూనిట్ సభ్యుడేనని వాదిస్తోంది. ఇదిలా ఉండగా.. వెస్ట్ బ్యాంక్ లో ఆదివారం ఇజ్రాయెల్ సైనికులు తమ ఆఫీసులోకి చొచ్చుకెళ్లి తమ సిబ్బందిని బలవంతంగా ఖాళీ చేయించడంపై ఆల్ జజీరా యాజమాన్యం మండిపడింది. మీడియాను ఇజ్రాయెల్ ఉక్కుపాదంతో అణచివేస్తోందని ఆరోపించింది

# శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ఫలితాలు.. తదుపరి అధ్యక్షుడిగా దిస్సనాయకే!



మొదటి పేజి తరువాయి

ఆయనే కనుక విజయం సాధిస్తే తొలి వామపక్ష దేశాధినేతగా రికార్డులకెక్కుతారు. ప్రస్తుతం ఉన్న లీడ్స్ ఇలాగే కొనసాగితే దిస్సనాయకే శ్రీలంక 9వ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడిగా నేడు ప్రమాణ స్వీకారం చేస్తారు. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గత రాత్రి పది గంటల నుంచి ఈ ఉదయం 6 గంటల వరకు దేశంలో కర్ఫ్యూ విధిస్తున్నట్టు ప్రకటించారు. అయితే, ఇప్పుడు దీనిని ఈ మధ్యాహ్నం వరకు పొడిగించారు. మరోవైపు, ప్రభుత్వం రేపు ప్రత్యేక సెలవు ప్రకటించింది. ఇటీవల దేశంలో సంభవించిన ఆర్థిక సంక్షోభం తర్వాత జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నిక కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, ప్రతిపక్ష నేత, సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ)కి చెందిన నేత సజిత్ ప్రేమదాస, జనతా విముక్తి పేరమున పార్టీకి చెందిన మార్క్సిస్ట్ నేత, అనుర కుమార దిస్సనాయకే సహా మొత్తం 39 మంది అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడ్డారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్యను సన్మానించిన ఐ ఎన్ టి యు సి నాయకులు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలం, కోయగూడెం ఓసీ సింగరేణి కార్మికులకు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి లాభాల వాటా నుండి దసరా బోనస్ 1.90 లక్షలు ప్రకటించడంతో ఆదివారం సింగరేణి కోయగూడెం ఓసీలో కార్మికులు కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగ ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కి ఆహ్వానించి ముఖ్యమంత్రి కి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరియు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కు కృతజ్ఞతలు తెలియజేశారు వారిని శాలువా కప్పి గజమాలతో సన్మానం చేశారు. ఈ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంట్రాక్టర్ కార్మికులను కూడా దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ బోనస్ ప్రకటించిందని వారు తెలియజేశారు. కార్యక్రమం లో సింగరేణి ఐ ఎన్ టి యు సి నాయకులు భూక్యా నాగేశ్వర్ రావు, రామ రావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్ , ఇస్లావత్ రెడ్యానాయక్, శివ నాయక్, బోడ మంగీలాల్ నాయక్, ఈది గణేష్, పోషాలు,చందర్ సింగ్, సర్దార్, సామినేని సాయి,శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో పిడుగు పడి మహిళ మృతి!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): నాగర్ కర్నూలు జిల్లా బిజినపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామంలో ఆదివారం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది, వివరాల్లోకి వెళితే బిజినపల్లి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామానికి చెందిన నీలమ్మ అనే మహిళ తమ వ్యవసాయ పొలంలో వ్యవసాయం చేసుకుంటున్న సందర్భంలో భారీ శబ్దాలతో ఉరుములతో కూడిన వర్షం పడింది, ఈ వర్షానికి ఆకాశంలోని మేఘాలు కమ్ముకోవడం మేకాక పిడుగు పడి నీలమ్మ అక్కడికక్కడే చనిపోయినప్పటికీ మరికొంతమంది తీవ్ర గాయాలకు గురయ్యారు, ఈ సంఘటన నాగర్ కర్నూల్ జిల్లాలోనే కాక రాష్ట్రంలో రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది, ఈ మధ్యకాలంలో విపరీతమైన ఎండలు దంచి కొడుతున్నాయి, వర్షాకాలమా ఎండాకాలమా అని చెప్పలేని పరిస్థితి నెలకొన్నది మండుతున్న ఎండలతో ఉగ్రరూపం తన ప్రతాపని భారీ వర్షం రూపంలో చూపిస్తున్నాయి, పిడుగు పడి చనిపోయిన మహిళ మృతి పట్ల ప్రతి ఒక్కరు సంతాపని ప్రకటించారు,

# శివంపేట మండల ప్రెస్ క్లబ్

### ఎన్నికైన సందర్భంగా ఘనంగా శాలువాలతో సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అజీజ్ ఎన్నికైన సందర్భంగా ఘనంగా శాలువాలతో సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ శివంపేట మాజీ ఎంపీటీసీ జంగం విజయ వెంకటేశం నాయకులు జంగం వెంకటేశం కాముని నాగేష్ లు ఘనంగా సన్మానించి అభినందించారు మండల కేంద్రమైన శివంపేటలో జరిగిన ఓ ఫంక్షన్ హాల్లో కార్యక్రమంలో శివంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారు ఈ సందర్భంగా ఘనంగా ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్ క్లబ్ ఉపాధ్యక్షులు గోవింద్ చారి ప్రధాన కార్యదర్శి నర్సింలు గౌడ్ ప్రెస్ క్లబ్ బాలు నాయక్ ఆనంద్ రాజపేట నాగేష్ శ్రీకాంత్ సత్యనారాయణ గౌడ్ మరియు సభ్యులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర అథ్లెటిక్స్ లో పతకాలు గెలుపొందిన ఆథ్లెట్లు ను అభినందించిన జిల్లా కలెక్టరు జితేష్ వి.పాటిల్ .



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఈ నెల 20 వ తేది హైదరాబాద్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చంపియన్షిప్ లో ముల్కలపల్లి కి చెందిన ఎం.పవన్ హై జంపు లో బంగరు పతాకాన్ని గెలుపొందగా ,పాల్వంచ కు చెందిన బి.డీకేశ్ సౌమిత్ 400 మీటర్ల హర్డిల్స్ లో కాంశ్య పతకం గెలుపొందిన సందర్భముగా ఆథ్లెట్లును మరియు జిల్లా కోచ్ పి .నాగేందర్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరు జితేష్ వి. పాటిల్ అభినందించారు. ఈ సందర్భముగా తను కూడా చదువుకునే రోజులల్లో 400 మీటర్ల పరుగు పందెం పోటిలలో అనేక పతకాలు గెలుపొందానని గుర్తు చేస్కున్నారు . అథ్లెటిక్స్ లో గ్రామీణ క్రిడాకారులు ఎక్కువుగా రాణిస్తారని తెలిపారు . జిల్లా లో అథ్లెటిక్స్ ప్రాక్టీసు కు 400 మీటర్ల ట్రక్ యొక్క అవసరాన్ని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.మహిధర్ కలెక్టరు కు వివరించగా , కలెక్టరు దీనికి స్పందిస్తూ శ్రీ రామచంద్ర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గ్రైండ్ ను పరిశీలంచవలసింది గా జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి ని ఆదేశించారు .ఈ కార్యక్రమము లో కాంగ్రెస్ నాయకుల కొత్వాల్ శ్రీనివాస రావు ,జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అద్యక్షులు యుగంధర రెడ్డి , వాలీబాల్ సినియర్ క్రిడాకారులు వై .వెంకటేశ్వర రావు ,అంతర్జాతీయ ఆథ్లెట్ అన్నం వెంకటేశ్వర్లు పాల్గున్నారు .

## సిఎంసి స్థల , వివాదం నుంచి తప్పుకుంటున్న

### కాంగ్రెస్ పార్టీ టౌన్ అద్యక్షుడు నాయిని శ్రీనివాసరెడ్డి



బయ్యారం,(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా , బయ్యారం మండల కేంద్రంలో సిఎంసి స్థల వివాదంలో మండల అఖిల పక్షం నుండి కాంగ్రెస్ పార్టీ బయ్యారం టౌన్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాసరెడ్డి తప్పు కుంటున్న ట్లు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎంసి స్థలం వివాదం అధికారులు చూసుకుంటారని ,పార్టీ పై తప్పుడు సంకేతాలు పోతున్న విషయాన్ని కొంత లేటుగా గ్రహించి వివాదం రహితుడిగా పక్కకు ఉంటున్నట్లు తెలిపారు. కొంత మంది పార్టీ ని బజారు కు ఈడుస్తూ పార్టీని నవ్వుల పాలు చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సిఎంసి స్థల వివాదంలో తలదూర్చడం నేరంగా బావిస్తున్నట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గమనించాలని తెలిపారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలు మరువరానివి

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువరానివని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రైవేట్ "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార" ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సదిస్తున్నారని,తక్కువ వేతనంతో పనిచేస్తున్నామనే భావన ఏమాత్రం లేకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం



ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని కొనియాడారు.అలాంటి వారిని ప్రోత్సహిస్తూ సాహితీ కళా వేదిక ద్వారా ఘనంగా సన్మానిస్తున్న శంకర్ గౌడ్ అభినందనీయులని అన్నారు.పట్టణంలోని రేడియంట్ పాఠశాల డైరెక్టర్ దేశ్ రాములు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని



చేపట్టడం ప్రశంసనీయమని చిన్నారెడ్డి వివరించారు.మాజీ జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధునాతన సాంకేతిక విజ్ఞానంపై చిన్నప్పటి నుండే విద్యార్థులలో ఆసక్తిని కలిగించాలని, తద్వారా చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసిన వారవుతారని అన్నారు.జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 100మంది ఉపాధ్యాయులను నిర్వాహకులు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, డి సి ఇ బి జిల్లా కార్యదర్శి సూర చంద్ర శేఖర్,గణేష్ కుమార్,శుభ లక్ష్మి బైరోజు చంద్ర శేఖర్,కందూరు నారాయణ రెడ్డి, బండారు శ్రీనివాస్,సత్తార్ డివి వి యస్ నారాయణ,గంధం నాగరాజు, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ ప్రకటించడం పట్ల

### హర్షం వ్యక్తం చేసిన కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో సింగరేణి కార్మిక ప్రాంతం చుంచుపల్లి మండలం లోని రుద్రంపూర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో అధ్యక్షులు రాసూరి శంకర్ మాట్లాడుతూ పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా 5000 రూపాయల బోనస్ ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యానికి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. సింగరేణిలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని యజమాన్యం ప్రకటించింది కానీ సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్స్, వర్కుషాప్, సి ఎస్ పి, సివిల్ మరియు ఇతర డిపార్ట్మెంటులలో దాదాపుగా 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు, 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వము మరియు యాజమాన్యం ప్రకటించడం వలన ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు దాదాపుగా సింగరేణిలో పనిచేస్తున్న 32,000 మంది ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి ఒక్కరు సీఎం పిఎఫ్, ఈపీఎఫ్ సభ్యత్వం కలిగి ఉన్నారు వారంతా రెగ్యులర్గా పనిచేస్తున్నారు.కాంట్రాక్ట్ కార్మికులకు 22 జీవో అమలు చేస్తే సింగరేణి యాజమాన్యానికి 100 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది 2023, 2024 సంవత్సరంలో సింగరేణికి 4,701 కోట్ల రూపాయలు లాభాలు వచ్చాయి కాంట్రాక్ట్ కార్మికులకు 22 జీవో అమలు చేయడం వలన సింగరేణి 100 కోట్లు భారం కాదని, వారి జీవితాలలో వెలుగును నిలిపిన వారు అవుతారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ 5000 రూపాయలు బోనస్ ఇవ్వాలని అలాగే 22 జీవో అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సమావేశంలో మడిపల్లి కరుణాకర్ ప్రధాన కార్యదర్శి, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రయాణసేవలు అందిస్తున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సంక్షేమబోర్డు కోసం కేంద్రపై రవాణారంగా కార్మికులు పోరాడాలి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. కొత్తగూడెంలో ప్రారంభమైన ఆటో వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మహాసభలు.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఆర్టీసీ సంస్థకు ధీటుగా మారుమూల పల్లెలకు సైతం ప్రజలకు ప్రయాణ సేవలందిస్తున్న ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన భాద్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఆ భాధ్యతను విస్మరించి



పన్నులు, ఫైన్ల పేరుతో కార్మికులను దోచుకునే పనిలో పాలకులు ఉన్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్ అండ్ ప్రైవేట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలు కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం క్లబ్బు వరకు కార్మికులు తమ ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ప్రదర్శించిన ఎర్ర జెండాలతో కొత్తగూడెం పట్టణం ఎరుపెక్కింది. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు వి ఎస్ బోస్ జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించారు. మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రవాణారంగ కార్మికులను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, రోడ్డు సేఫ్టీ చట్టాలు, అపరాధ రుసుములు, పన్నుల పేరుతో కార్మికుల జేబులు కొల్లగొడుతూ ఖజానా నింపుకుంటోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచు కార్మికులపై భారం మోపుతున్నారని, అన్ని వసతులపై జీఎస్టీ విధిస్తున్న కేంద్రం పెట్రోల్, డీజిలుపై ఎందుకు జీఎస్టీ విదించరో సమాధానం చెప్పాని, ఈ విధానం ఇంధన కంపెనీలకు మేలుచేసేందుకేనని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు తరహాలో దేశవ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమిస్తున్న కేంద్రం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తిరగబడితేనే న్యాయం జరుగుతుందని కూనంనేని అన్నారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఏర్పడిన ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ ఐదు దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతోందని, అనేక హక్కులు సాధించిపెట్టింది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతి నెల రూ.12వేల ఆర్థికసాయం అయిందించి ఆదుకోవాలని, భీమా సౌకర్యం కల్పించాలని, బీమాను రూ.10లక్షలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రవాణా రంగ కార్మికుల ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏఐటీయూసీ ఎస్ కె సాబీర్ పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి ఎస్ బోస్, ఎస్ బలరాజు, బి వెంకటేష్, నరాటి ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మహాసభలో సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కె సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పెరబోయిన మోహన్ రావు, దేవరకొండ శంకర్, వి పూర్ణచందర్ రావు , వి. మల్లికార్జున్ , ఎస్ వి. రమణ మూర్తి,బరిగెల సంపూర్ణ , గనిగల వీరస్వామి, వి పద్మజ,జి రామకృష్ణ, భూక్య దస్రు, కందుల భాస్కర్, జి నగేష్, బరిగెల భూపేష్, నేరెళ్ల రమేష్, యూసఫ్, మర్రి గోపికృష్ణ రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి కమ్యూనిస్టుల ఉమ్మడి ఆస్తి

### ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి వామపక్షాలకు తీరని లోటు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సీతారాం ఏచూరి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి ఉమ్మడి ఆస్తి అని ఏచూరి మరణం భారతదేశానికి వామపక్ష రాజకీయాలకు తీరని లోటుని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తన మేదస్సుతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సైతాంతికంగా నిలబెట్టిన ధీరుడు సీతారాం ఏచూరి అని ఆయన కొనియాడారు. బ్రతికున్నంత కాలం కమ్యూనిస్టు ఉద్యమానికి గౌరవ ప్రతిష్టలు అందించడమే కాకుండా ఆయన మరణం తర్వాత కూడా కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషమైన గౌరవాన్ని అందించి వెళ్లిన కామ్రేడ్ సీతారామయ్య ఏచూరి అజరామరుడని ఆయన వారసత్వంతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కష్టజీవుల రాజ్యం సాధించేంతవరకు పోరాటాల నిర్వహించాలని కమ్యూనిస్టులు ఐక్యమై పెట్టుబడుదారి వ్యవస్థకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తూ కష్టజీవుల రాజ్యాన్ని సాధించడమే ఏచూరి కి అందించే ఘనమైన నివాళి అని అన్నారు. అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ,మాజీ ఎంపీ మధు మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారతదేశ కమ్యూనిస్టు రాజకీయాల వ్యవహారాలలోనే కాక అంతర్జాతీయ కమ్యూనిస్టు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సిపిఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, సీనియర్ న్యాయవాది రమేష్ కుమార్ మక్కాడ్, టీజేఎస్ రాష్ట్ర నేత మల్లెల రామనాథం, బిఆర్ఎస్ విద్యార్థి నేత అనుదీప్ , సిపిఐ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్ ,సిపిఎం పట్టణ అధ్యక్షుడు లిక్కి బాలరాజు, భూక్య రమేష్, వీరన్న , డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు పోలీస్ స్టేషన్ లో హాజరు కాగలరు



### బయ్యారం ఎస్సై కె తిరుపతి

బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లో గత కొంత కాలంగా కొంతమంది కులాలను ,పార్టీ లను ,మతాలను ,వ్యక్తులను రెచ్చగొట్టే విదంగా ఇష్టారాజ్యంగా వాట్సాప్ గ్రూపులో షేర్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అట్టి వారిని గుర్తించి పోలీసు స్టేషన్ లో మొదటి తప్పుగా బావించి కౌన్సెలింగ్ ఇప్పించడం జరిగింది. అయినా వారిలో మార్పు కనపడటం లేదు.ది.23.9.2024 ఉదయం 11 గంటలకు బయ్యారం లో వివిధ వాట్సప్ గ్రూప్ అడ్మిన్ లు స్థానిక పోలిసు స్టేషన్ లో హాజరు కాగలరు. వారికి ప్రత్యేక సమావేశం ఉంటుంది. దీనిపై సిఐ రవికుమార్ ప్రసంగిస్తారు.అందరు తప్పక హాజరు కావాలి.లేని ఎడల మండలంలో శాంతి భద్రతల నేపథ్యంలో చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన



### తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తాలి

నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట్ మండల కేంద్రంలోని రుస్తుంపేట రమేష్ కు ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ కావడంతో తలకు గాయం కావడంతో ప్రముఖ సంఘ సేవకుడు తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా వారి సొంత నిధులనుండి 5000 వేల రూపాయలు రాజీపేట శ్రీకాంత్ తో పంపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రుస్తుంపేట సాయి వజ్జ హరి తదితరులు పాల్గొన్నారు

## వరద బాధితులు సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్ కి 10 లక్షలు...

### శ్రీ ఇందు గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ ఆర్ వెంకట్రావు.





హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి కి అత్యంత సన్నిహితులు కర్నాటి రాజా ఆధ్వర్యంలో సీఎం స్వగృహంలో వరద బాధితుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి 10 లక్షల చెక్కు ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి అందజేశారు. ఇందులో భాగంగా శ్రీ ఇందు గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ (ఇబ్రహీంపట్నం) ఛైర్మన్ వెంకట్ రావు, వి బి జి ఫౌండర్ మడిపడిగా రాజు పి ఎస్ కె అధినేత పుల్లూరు శ్రీకాంత్, గుగ్గిల యాదగిరి బ్రదర్స్, శంకర్ , వెంకటస్వామి , సతీష్,మరియు కొండారెడ్డిపల్లి గ్రామస్తులు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో ఆవిష్కరించబోయే ఆల్ఫా సర్కిల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ని కోరారు. వారు సానుకూలంగా స్పందించి అభినందించారు.

## మార్కెట్ కమిటీ పదవులు అమ్ముకున్నారు

మల్లపూర్ (గౌతమ్ న్యూస్): మల్లాపూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ డైరెక్టర్ల నియామకం జరిగింది ఇందులో రేగుంట గ్రామానికి చెందిన చిలివేరి రాములు కు డైరెక్టర్ పోస్టు లక్ష రూపాయలకు అమ్ముకున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు మస్కట్ నుండి ఫోన్ రికార్డు ద్వారా సోషల్ మీడియాలో తెలిపారు చిలువేరి రాములు బు కబ్జాలపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఒక ఆడియో రికార్డు పెట్టారు దానిలో మాట్లాడుతూ ఎలాల జలపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీ ని నాశనం చేస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అయినా జలపతి రెడ్డి అక్కడ డబ్బులు తీసుకున్నాడు అని ఎమ్మెల్యే వెళ్ళగొడితే టిఆర్ఎస్ నుంచి బహిష్కరిస్తే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి వారి టిఆర్ఎస్ పాత అనుచరులకు పదవులు కట్టబెడుతున్నారు అని కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేసి పార్టీని సర్వనాశనం చేస్తున్నారని అలాగే డైరెక్టర్ పోస్టు కోసం లక్ష రూపాయలు తీసుకున్నారని జగమెరిగిన సత్యం అని తెలిపారు, అలాగే మల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోస్టు ఫర్ సెల్ కాంటాక్ట్ జలపతి రెడ్డి అని సోషల్ మీడియాలో రాసింది మరియు ఆడియో రికార్డు ఇప్పుడు సంచలనంగా మారింది అలాగే కాంగ్రెస్ పార్టీకి 10 సంవత్సరాలు కష్టపడ్డ నాయకులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం కష్టపడ్డది ఎవరు ఇప్పుడు పదవులు అనుభవిస్తున్నది ఎవరు అని కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారూ అని ఆ ఆడియో సారాంశం

## నా కార్యకర్తల జోలికొస్తే మూడింతలుగా రిటర్న్ గిఫ్ట్ ఇస్తా..



**అమరావతి,:** నెల్లూరు సిటీ నియోజకవర్గ కార్యకర్తలతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా కార్యకర్తల జోలికొస్తే మూడింతలుగా రిటర్న్ గిఫ్ట్ ఇస్తాను అని వార్నింగ్ ఇచ్చారు. మూడేళ్లకు పైగా మంత్రిగా పనిచేశా.. నారాయణ విద్యాసంస్థల జోలికి వెళ్లలేదు.. ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదు.. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ మూడు నెలల్లోనే అనేక మంది వైసీపీ నేతలు కార్యకర్తలను బెదిరిస్తున్నారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మేము అనుకుని ఉంటే నారాయణ విద్యాసంస్థలు ఉండేవా అని ప్రశ్నించారు. దసరా నుంచి నెల్లూరులోనే అందుబాటులో ఉంటా.. కార్యకర్తలను రక్షించుకుంటాం.. అండగా ఉంటామని అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇక, తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని అసత్య ఆరోపణలు చేస్తున్న టీడీపీ ప్రభుత్వం.. వెంటనే విచారణ చేయాలని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారంతో శ్రీవారి భక్తుల మనోభవాలను దెబ్బ తీయొద్దని కోరారు. చంద్రబాబు సర్కార్ చేస్తున్న దారుణమైన పనులను కలియుగ వైకుంఠ క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి చూస్తున్నాడని చెప్పారు.

# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి
- గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా..
- కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు లభిస్తాయని వ్యాఖ్య
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జాగ్రత్తగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఇవ్వొద్దని, ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల విషయంలో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని స్పష్టం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, పోస్టింగులు విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించినట్టు సమాచారం. అందువల్ల ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పనిచేసుకుంటే.. రెండోసారి కూడా అధికారంలోకి వస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం నేపథ్యంలో.. ఆయనకు అభినందనలు తెలిపేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సీఎల్పీ సమావేశమైంది. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. మహేశ్‌గౌడ్ నియామకంపై పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

### సమన్వయంతో ముందుకు వెళ్లాలి

సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లే బాధ్యతలను పార్టీ నేతలు తీసుకోవాలని కోరారు. “పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయి. నిబద్ధత కలిగిన నాయకుడు కాబట్టే మహేశ్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది. బీసీల కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. ఆయన ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సుప్రీం తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి..” అని రేవంత్ పేర్కొన్నారు.

### ప్రజల్లో ఉండేవారికే డీసీసీల బాధ్యతలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ చెప్పారు. అధికారం కోల్పోయిన అసహనంతో ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఆ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని.. తెలంగాణలో చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని, రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉన్న వారికే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులు వస్తాయన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు తమ జిల్లాలో పర్యటించాలని సూచించారు.

### కార్యకర్తల రుణం తీర్చుకోవాలి: మహేశ్‌గౌడ్

తాను పీసీసీ అధ్యక్ష పదవిని బాధ్యతగా భావిస్తానని.. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా ఉంటానని పీసీసీ చీఫ‌మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీని ముందుకు నడపడంలో సమష్టి బాధ్యత అవసరమన్నారు. కార్యకర్తలు, నేతలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. క్షేత్రస్థాయి కార్యకర్తలు కష్టపడి పనిచేసినందుకే అధికారంలోకి రాగలిగామన్న విషయాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు గుర్తించాలని.. ఆ కార్యకర్తల రుణం తీర్చుకోవాలని పేర్కొన్నారు. అధికారాన్ని కట్టబెట్టిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని పార్టీ ప్రజాప్రతినిధులను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% స్థానాలను గెలిపించుకోవడం ద్వారా పార్టీ కార్యకర్తలను గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు పదవుల్లో కూర్చోబెట్టాలన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని.. కార్యకర్తలను సమాయత్తం చేసి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని మహేశ్‌గౌడ్ చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయంగా అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం పనిచేయాలని కోరారు.

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించిన సీఎం

సీఎం రేవంత్ సీఎల్పీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరి స్థితి గురించి ఎమ్మెల్యేలకు వివరించారు. రాష్ట్ర ఖ జానాకు నెలకు సగటున రూ.18 వేలకోట్ల ఆదా యం వస్తోందని.. అందులో రూ.6 వేలకోట్లు ప్రభు త్వ ఉద్యోగుల జీతాలకే పోతాయని, మరో రూ.6 వేలకోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటి వడ్డీలకు చెల్లిస్తున్నామని చెప్పారు. మిగతా రూ.6 వేలకోట్లలో రూ.3 వేలకోట్లు ప్రభుత్వ పథకాల అమలు కోసం ఖర్చవుతున్నాయని, ఇంకో రూ.3 వేల కోట్లతో కొత్త పథకాల అమలు, ప్రభుత్వ నిర్వహణ జరుగుతోందని వివరించారు. ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉండటంతో దుబారా ఖర్చులు తగ్గించుకుని ప్రభుత్వాన్ని నడుపుతున్నామని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ, ఫ్యామిలీ హెల్త్ కార్డుల అంశాలను ఎమ్మెల్యేలకు సుదీర్ఘంగా వివరించారు. పాత రేషన్‌కార్డులు తొలగించడం లేదని.. ఈ విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ఇక ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బాలూ నాయక్, పర్ణికారెడ్డి, అమీర్ అలీఖాన్ తదితరులు మాట్లాడారు.

### సీఎల్పీ సమావేశానికి ‘ఫిరాయింపు’ ఎమ్మెల్యేలు!

ఆదివారం రాత్రి జరిగిన సీఎల్పీ సమావేశానికి బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా హాజరవడం గమనార్హం. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీతోపాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలంతా సమావేశంలో పాల్గొన్నారు. ఇక మంత్రి సీతక్క, ఇద్దరు, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనివార్య కారణాలవల్ల సీఎల్పీ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

### గాంధీ నియోజకవర్గమనే వచ్చారు: మంత్రి శ్రీధర్‌బాబు

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బీఆర్ఎస్ నేత అయినప్పుడు సీఎల్పీ సమావేశానికి ఎందుకు వచ్చారనే ప్రశ్నలకు.. సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. ఏదైనా నియోజకవర్గానికి సీఎం వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలవడం సాధారణమేనని చెప్పారు. సీఎల్పీ సమావేశం జరిగిన హోటల్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉందని.. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా సీఎంను కలిసేందుకు వచ్చారని పేర్కొన్నారు. సిద్దిపేటలో సీఎం కార్యక్రమం జరిగితే హరీశ్‌రావు వెళ్లరా? అని ప్రశ్నించారు.

# వేళల పరిమితి.. డ్రై డే ...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నాడు ప్రకటించిన నూతన మద్య విధానం తాగుడును మరింత ప్రోత్సహించేదిగా ఉండడం ఆందోళనకరం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన మద్యాన్ని, నాణ్యమైన విధానాన్ని తీసుకొస్తామని ఈ సందర్భంగా మంత్రులు చేసిన ప్రకటనలో నాణ్యత మాటల్లోనే కానీ, విధానంలో కనపడలేదు. పాత సిండికేట్ విధానాన్ని ఈ కొత్త పాలసీ మళ్లీ తెర మీదికి తెచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రయివేటు మద్యం షాపులను తీసుకురావడమంటేనే - మద్యం అమ్మకాలను విచ్చలవిడిగా ప్రోత్సహించటం అవుతుంది. మద్యం వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి, పోటాపోటీగా అమ్మకాలను సాగించటానికి అవకాశం ఇచ్చినట్టవుతుంది. ఇలా వీధివీధినా మద్యం సులభంగా లభ్యం కావడం అనేది మద్యం ప్రియుల ఆరోగ్యాన్ని, కుటుంబ జీవనాన్ని నాశనం చేస్తుందే తప్ప- ఆరోగ్యకర సమాజానికి బాసటగా నిలవదు. 2019 ఎన్నికల సమయంలో మద్య నిషేధమూ, నియంత్రణ ప్రచారాస్త్రాలు అయితే, 2024 ఎన్నికల వేళ రాష్ట్రంలో నాణ్యమైన మద్యం దొరకటం లేదన్న మద్యం ప్రియుల ఫిర్యాదు ఒక ప్రచారాంశంగా మారింది. ‘నాణ్యమైన మద్యం’, ‘బ్రాండు మద్యం’, ‘తక్కువ ధరకు మద్యం’ అన్న హామీలను స్వయంగా చంద్రబాబే వినిపించారు. అధికారంలోకి వచ్చాక మద్యం మీద కూడా శ్వేతపత్రం ప్రకటించి, జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.18,860 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మద్య నిషేధం తీసుకొస్తామని చెప్పి మోసగించారని,



నాణ్యత లేని మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారంటూ విమర్శించారు. వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి, కొత్త పాలసీని తీసుకొస్తామని వెల్లడించారు. అధ్యయనం కోసం నలుగురు మంత్రులతో ఏర్పడిన ఉపసంఘం ఆరు రాష్ట్రాల్లో పరిశీలనలు జరిపినట్టు పేర్కొంది. అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్న నూతన మద్య విధానం గురించి చెబుతూ గత ప్రభుత్వ తీరును విమర్శించింది. మద్యం ధరలు కొంత మేర తగ్గించటం, అమ్మకాల సమయాన్ని రాత్రి 9 నుంచి 10 గంటలకు పొడిగించటం, దాదాపు 4 వేల ప్రయివేటు మద్యం షాపులను ఏర్పాటు చేయటం తాము కనుగొన్న పరిష్కారాలుగా ప్రకటించింది. దేశంలోనే అత్యధికంగా తాగుతున్న పురుషులున్న రాష్ట్రాల్లో రెండోస్థానం పొందిన తెలంగాణా మద్యం పాలసీ తమకు ఆదర్శంగా ఉన్నట్టుగా తెలిపింది. మద్యాన్ని అంతటా అందుబాట్లోకి తేవటమే ఈ కొత్త పాలసీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది తప్ప, ప్రజల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా కుటుంబాల స్థితిగతులను పట్టించుకోలేదు. మద్యం దుకాణాలు పరిమిత సంఖ్యలో ఉండడం, వాటిని ప్రభుత్వమే నిర్వహించటం, పరిమిత వేళల్లో పనిచేయడం, డ్రై డే పాటించటం వంటివి మద్యపానంపై నియంత్రణకు దోహదపడతాయని దక్షిణాదిన కేరళ అనుభవం. బీహార్‌లో ఇప్పుడు మద్య నిషేధం అమలవుతోంది. గతంలో మన రాష్ట్రంలోనూ మద్య నిషేధంపై మహిళలు పెద్దఎత్తున ఉద్యమించి, విజయం సాధించిన అనుభవం ఉంది. తాగుడు వల్ల కుటుంబాలు సర్వ నాశనం అవుతాయని, నేరాలు పెరుగుతాయని, ముఖ్యంగా మహిళలపై హింస పెచ్చరిల్లుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మద్యనిషేధం, మద్యంపై నియంత్రణ వంటి డిమాండ్లు ముందుకొచ్చాయి. మనకున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులరీత్యా ఇలాంటి సమాజ, కుటుంబ శ్రేయస్సుకు దోహదపడే మద్యం విధానాన్ని అనుసరించాలి. ఆదాయాన్ని పెంచుకోవటానికో, మద్యం ప్రియులను సంతృప్తిపరచటానికో, అనుయాయుల ఆదాయ వృద్ధికో మద్యం పాలసీ ఉండరాదు. కుటుంబ పోషణకే చాలీచాలని ఆదాయాలతో సతమతమవుతున్న కోట్లాదిమంది పేదలూ, సామాన్యులూ ఉన్న సమాజం మనది. అలాంటి కుటుంబాలు మరింతగా దిగజారిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! మద్యపానాన్ని నిరుత్సాహపరిచే దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలి. కేరళ, తమిళనాడు, ఢిల్లీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి కృషి వేర్వేరు రూపాల్లో జరుగుతుంది. ఇలాంటి అనుభవాలను మంత్రివర్గ ఉపసంఘం ఏమేరకు అధ్యయనం చేసిందో, ఏయే అంశాలను గ్రహించిందో కూడా వెల్లడించాలి.

# ఎంపాక్స్ - వ్యాక్సిన్ అసమానతలు




ఆఫ్రికా ఖండంలోని డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, దాని ఇరుగు పొరుగు దేశాలైన బురుండి, కెన్యా, రువాండా, ఉగాండా తదితర దేశాలలో మంకీ పాక్స్ వ్యాధి విజృంభించడంతో ఆగస్టు 14న అంతర్జాతీయంగా అన్ని దేశాలకు ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) జారీ చేసింది. దీనినే డబ్ల్యు.హెచ్.ఓ ఎంపాక్స్‌గా పిలుస్తోంది. వైరస్ ద్వారా వ్యాపించే ఎంపాక్స్ వ్యాధి మధ్య ఆఫ్రికా, పశ్చిమ ఆఫ్రికా దేశాలను కొన్ని దశాబ్దాలుగా వణికిస్తూనే వుంది. దీన్ని ఆఫ్రికా దేశాలే కాక ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా, సమన్వయంతో ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియచేసింది. భారత దేశంలో కూడా 2022 జులైలో 30 కేసులు కనిపించడంతో పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని విధించారు. అయితే 2023 ఏప్రిల్ కల్లా తగ్గుముఖం పట్టడంతో మే లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించారు. 2022లో ఈ వ్యాధి 116 దేశాలకు విస్తరించి 99,176 కేసులు నమోదు కాగా 208 మంది మరణించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అమెరికాలో వెయ్యికి పైగా కేసులు నమోదవగా మన దేశంలో మూడు కేసులు మాత్రమే నమోదైనట్లు తెలుస్తోంది.

### ఎంపాక్స్ అంటే

ఈ వ్యాధి కోతుల ద్వారా వ్యాప్తి చెందుతుందని భావించడం వలన దీనిని మొదట మంకీ పాక్స్ అని పిలిచారు. అయితే వ్యాధి వ్యాప్తికి కోతులు వాహకాలుగా పని చేయడం లేదని, ఇది ఆఫ్రికన్ ఎలుకలు, ఉడతల వంటి జంతువుల ద్వారా సోకుతుందని గుర్తించిన కారణంగా డబ్ల్యు.హెచ్.ఓ దీనిని ఎంపాక్స్‌గా పేరు మార్చింది. స్వలింగ సంపర్కుల్లో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోందని గుర్తించారు. రెండు నుండి నాలుగు వారాల పాటు తీవ్రమైన జ్వరం, వంటి నిండా దద్దుర్లు, లింఫ్ గ్రంథులు వాచి విపరీతమైన బాధ వంటి లక్షణాలు రోగుల్లో నమోదయ్యాయి. రోగం ముదిరితే దీంతోపాటుగా చాలా రకాల చర్మ సంబంధిత వ్యాధులు, మెదడువాపు వ్యాధి, కళ్ళల్లో పుళ్ళు ఏర్పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ సోకడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాధి సోకిన వారిలో 3-6 శాతం మంది మరణాల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియచేసింది. ఇరవయ్యవ శతాబ్దంలో 30 కోట్ల మంది మరణానికి కారణమైన మసూచి వైరస్‌కి, ఎంపాక్స్ వైరస్‌కి దగ్గర సంబంధం, పోలిక ఉన్నాయి. కానీ, ఇది డి.ఎన్.ఏ రకానికి చెందినది కావడం వలన ఆర్.ఎన్.ఏ వైరస్ రకానికి చెందిన కోవిడ్19 మహమ్మారిలా విజృంభించే అవకాశం తక్కువ. అయినప్పటికీ ఒక మనిషి నుండి మరొక మనిషికి సంక్రమించే రేటు తక్కువగా ఏమీ లేదు. ఒకరి నుండి 2.4 మందికి వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### వ్యాక్సిన్లు (టీకాలు)

మసూచికి వాడే టీకా 85 శాతం సామర్థ్యంతో కొన్ని ఎంపాక్స్ వైరస్ రకాలకు కూడా పని చేస్తుందని తేలింది. అలాగే మసూచికి వాడే టికోవిరిమాట్ అనే మరో రకం టీకా ఎంపాక్స్ చికిత్సలో ఉపయోగపడుతుందని ‘యూరోపియన్ మెడిసిన్స్ ఏజన్సీ’ తెలిపింది. వ్యాధి విజృంభించిన పరిస్థితుల్లో పైన ఉదహరించిన వ్యాక్సిన్లు పరిమితమైన ఫలితాలనే ఇస్తున్నాయని అనుభవాలు చెబుతున్నాయి. ఎం.వి.ఎ-బి.ఎన్, ఎల్.సి 16, ఎ.సి.ఎ.ఎమ్ 2000, రష్యా వారి ఆర్థో ఫాక్స్ వాక్ వంటి పలు రకాల వ్యాక్సిన్లు ఎంపాక్స్‌ను నివారించగలవని డబ్ల్యు.హెచ్.ఓ సిఫారసు చేస్తోంది. ఈ టీకాలను 18 సంవత్సరాలకు పైబడిన వారు 28 రోజుల వ్యవధిలో రెండు మోతాదులు తీసుకోవాలి. 2024 జూన్‌లో వెలువడిన ఒక అధ్యయనం ప్రకారం ఎం.వి.ఎ-బి.ఎన్ మొదటి డోస్ 76 శాతం సామర్థ్యం చూపగా రెండో డోస్‌తో అది 81 శాతానికి పెరిగింది. అంతేకాక రోగ నిరోధక శక్తిని కూడా గణనీయంగా పెంచుతోందని తెలుస్తోంది. అలాగే ఎల్.సి 16, ఆర్థోఫాక్స్ వాక్ వ్యాక్సిన్లను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు.

### వ్యాక్సిన్ అసమానతలు

2022లో ఎంపాక్స్ సోకిన సమయంలో, కోవిడ్ లేదా ఇతర మహమ్మారుల సమయంలో ధనిక దేశాలు పేటెంట్ల పేరుతో వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి గుట్టలు గుట్టలుగా తయారు చేసికొని తమ అవసరాలకు మించి నిల్వ పెట్టుకొని పేద, ఇతర దేశాలకు సరైన సమయంలో అవసరానికి తగ్గట్టుగా కేటాయించక, వారికి అన్యాయం చేశాయి. కోవిడ్ సమయంలో అంతర్జాతీయ సమాజం ఎన్ని విజ్ఞప్తులు చేసినా చలించని ధనిక దేశాలు ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడుతున్న వ్యాక్సిన్లను పేద దేశాలకు ఇవ్వచూపించారంటే వ్యాక్సిన్ అసమానతలు పేద దేశాల విషయంలో ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పుడు కూడా, ఎంపాక్స్ తీవ్రత ఎక్కువగా ఉన్న కాంగో దేశానికి మొదటి పది వేల డోసుల్ని పంపి ఆదుకోవాల్సి ఉండగా అట్లాకాక రాజకీయ కారణాలతో అమెరికా మొదటి పది వేల డోసుల వ్యాక్సిన్లను నైజీరియాకు పంపింది. ఎంపాక్స్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న అనేక ఆఫ్రికన్ దేశాలు వ్యాక్సిన్ల కోసం ఐక్యరాజ్య సమితిని, డబ్ల్యు.హెచ్.ఓ నీ, ధనిక దేశాలను దేబిరించాల్సిన పరిస్థితి ఉంది. అటువంటి పేద దేశాలు కూడా చాలా ఎక్కువ ధరకు (ఒక్కో రకం డోసుకు వంద డాలర్లకు పైగా చెల్లించి) కొనుక్కొని, వాటిని మైనస్ 20 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత దగ్గర నిల్వ చేసుకొనే కనీస వసతులు కూడా లేని దేశాలు తీవ్రమైన వ్యాక్సిన్ అసమానతలకు గురవుతున్నాయి. ఎంపాక్స్ తాకిడితో వణికిపోతున్న ఆఫ్రికా ఖండంలోని దేశాలన్నింటికీ సుమారు కోటి డోసుల వ్యాక్సిన్లను తక్షణమే అందించాలని ఆఫ్రికా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అంచనా వేసింది. కానీ ధనిక దేశాలు, పేటెంట్లు కలిగి ఉన్న దేశాలు తమ ప్రజల వ్యాక్సిన్ అవసరాలు తీర్చే నెపంతో, వ్యాధి విస్తృతి అంతగా లేకపోయినా అవసరానికి మించి వ్యాక్సిన్ గుట్టలను తమ దగ్గర పోగేసుకొనే ప్రమాదం వుంది. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలు వ్యాక్సిన్లను ఎంపాక్స్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పేద దేశాలకు తక్షణమే అందించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాధి సోకిన వారికి వైద్యం అందించేలా చూడాలని, తద్వారా వ్యాక్సిన్, వైద్యపరమైన అసమానతలను నివారించాలని, ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యతను గుర్తెరగాలని అభ్యుదయ కాముకులు, అంతర్జాతీయ సమాజం కోరుతున్నాయి.

## జగన్ ను మరింత డిఫెన్స్ లో పడేసిన పవన్ కళ్యాణ్



అమరావతి : తిరుమల లడ్డూ వివాదంలో పవన్ తీరు మరింత చర్చకు దారితీస్తోంది. జాతీయస్థాయిలో సైతం హాట్ టాపిక్ గా మారింది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిపారని వివాదం రేగిన సంగతి తెలిసిందే. లక్షలాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఈ వ్యవహారం ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ఆయన చేసిన ట్వీట్ జాతీయ స్థాయిలో సైతం వైరల్ గా మారింది. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ అభిప్రాయపడ్డారు. ఇందుకుగాను ప్రత్యేక చట్టంతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై నేషనల్ లెవెల్ లో చర్చ జరుగుతోంది. అదే సమయంలో ఈ వ్యవస్థ ఏర్పాటు అనేది ఇతర మతాలకు వ్యతిరేకం కాదని కూడా పవన్ తేల్చి చెప్పారు. మరోవైపు వైసిపి హయాంలో అడ్డగోలు వ్యవహారాలు నడిచాయని బయట పెట్టడంలో పవన్ సక్సెస్ అయ్యారు. మాజీ సీఎం జగన్ ను డిఫెన్స్ లో పెట్టారు. తాజాగా పవన్ ప్రాయశ్చిత దీక్ష ప్రారంభించారు. 11 రోజులు పాటు ఈ దీక్ష కొనసాగించనున్నారు. చివరి రోజు తిరుమలలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. దీక్షను స్వీకరించిన సందర్భంగా పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు.గత ఐదేళ్లుగా తిరుమలలో అడ్డగోలు వ్యవహారాలు నడిచాయని గుర్తు చేశారు.భక్తుల మనోభావాలు దెబ్బతీనేలా అనేక వ్యవహారాలు వైసిపి ప్రభుత్వం నడిపిందని చెప్పుకొచ్చారు. దీనిపై జాతీయస్థాయిలో చర్చ జరగాలన్నారు. లడ్డుప్రసాదం తయారీలో ఏదో జరుగుతోందని గతంలోనే అనుమానించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా సరే సరైన చర్యలు తీసుకోలేదని చెప్పుకొచ్చారు.శ్రీవాణి ట్రస్ట్ పేరిట కోట్లాది రూపాయల గోల్మాల్ జరిగిందని పవన్ గుర్తు చేశారు.చివరకు శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో జంతు కొవ్వు వాడారని బయటపడడం దురదృష్టకరమన్నారు. తిరుమలలో ఇంత జరుగుతుంటే చైర్మన్గా వైవి సుబ్బారెడ్డి,కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. శ్రీవాణి ట్రస్ట్ పేరిట పదివేల రూపాయలు వసూలు చేసి.. 500 రూపాయల రసీదు రాసిన విషయాన్ని . మిగతా సొమ్ముప్రస్తావించారుము ఎటు పోయిందని నిలదీశారు. ఇంత జరిగినా జగన్ అడ్డగోలుగా సమర్ధించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణ పై జాతీయస్థాయిలో చర్చ జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఈ వివాదం లో జగన్ ను పూర్తి డిఫెన్స్ లో పడేశారు పవన్. జగన్ హయాంలో వైఫల్యాలను గుర్తు చేస్తూనే.. జాతీయ స్థాయిలో చర్చ జరిగే లా సనాతన ధర్మ పరిరక్షణ కోసం గళం ఎత్తారు. ఇప్పుడు ప్రాయశ్చిత్త దీక్షతో మరింత చర్చ జరిగేలా చూశారు. దీంతో వైసిపి ఆత్మ రక్షణలో పడింది.

## ఏపీలోకి జానీవాకర్, ఇంపీరియల్ బ్లూ, బ్లాక్ డాగ్, యాంటిక్విటీ వచ్చేశాయి




ఏపీలో గత ఐదు సంవత్సరాలుగా మద్యం దుకాణాలను వైఎస్ జగన్ ప్రభుత్వమే నిర్వహించింది. ఆ సమయంలో జాతీయంగా, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురాలేదు. స్థానికంగా తయారయ్యే మద్యాన్ని సరఫరా చేయడంతో దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ మందుబాబులు ఆందోళన చేసేవారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో మందుబాబుల పంట పండింది. ఇకనుంచి మద్యం దుకాణాలను ప్రయివేటు వ్యక్తులద్వారానే నిర్వహింపచేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇంపీరియల్ బ్లూ వచ్చేసింది

బ్రాండెడ్ మద్యం ఏపీలో ఇకనుంచి అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికీ ఇంపీరియల్ బ్లూ, మెక్ డొవెల్స్ లాంటి బ్రాండ్లు రాష్ట్రానికి చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న రాయల్ ఛాలెంజ్, జానీవాకర్, వాట్ 69, యాంటిక్విటీ, వోడ్కా, బ్లాక్ డాగ్ లాంటివన్నీ ఏపీలోని మద్యంలో షాపుల్లో విక్రయించనున్నారు. వచ్చేనెల ఒకటోతేదీ నుంచి నూతన మద్యం విధానం తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా 10 శాతం మద్యం దుకాణాలను గీత కార్మికులకు కేటాయించనున్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనే లిక్కర్ విధానం మారుస్తామని ప్రకటించిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం మద్యం విధానాన్ని సంపూర్ణంగా మార్చేశారు.

రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీలు

గతంలో బ్రాండెడ్ మద్యం దొరక్క తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వెళ్లి మరీ మందుబాబులు కొనుగోలు చేసుకొని తెచ్చేవారు. రాష్ట్రాల సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో తనిఖీలు నిర్వహించి వీటిని ఎక్స్ జ్ శాఖ స్వాధీనం చేసుకునేది. ఆయాన రాష్ట్రాలకు సరిహద్దుల్లో నివసించేవారు మాత్రం రోజు ద్విచక్రవాహనాలపై వెళ్లి తమకు కావల్సిన బ్రాండ్లు తెచ్చుకునేవారు. కొంతమంది హైదరాబాద్ నుంచి గుంటూరు రైలు ద్వారా బ్రాండెడ్ మద్యాన్ని సరఫరా చేసేవారు. సికింద్రాబాద్ లో కొందరు వ్యక్తులు ఒక సీటు నెంబరు పేరు గుంటూరులో ఉన్నవారికి చెప్పి ఆ సీటు కింద సరుకు ఉంచేవారు. గుంటూరులో సంబంధిత వ్యక్తులు వచ్చి ఆ సీటుకింద ఉన్న బాక్సులను తీసుకువెళ్లేవారు. ఎవరికీ అనుమానం రాకుండా చేసినప్పటికీ చివరకు దొరికిపోవడంతో కటకటాలపాలయ్యారు. కాగా, గతంలో ఏపీలో నాసిరకం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో మందుబాబులు పక్క రాష్ట్రాలకు వెళ్లి అక్రమంగా మద్యం తెచ్చుకునేవారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి ప్రాంతాలకు వెళ్లి ప్రముఖ బ్రాండ్ల లిక్కర్ తెచ్చుకునేవారు. ఇక నుంచి వారికి ఆ ఇబ్బందులు ఉండవు. ప్రముఖ లిక్కర్ బ్రాండ్లు ఏపీలోనే అందుబాటులోకి రానున్నాయి.

## అల్పపీడనం ఎఫెక్ట్.. ఈ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు



విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. శనివారం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ మళ్లీ కీలక ప్రకటన చేసింది. బంగాళాఖాతంలో, తూర్పు-పశ్చిమ గాలి విచ్చిన్నతిలో కేంద్రీకృతమై, మధ్య ట్రోపోస్పియర్ స్థాయిల వరకు ఆవర్తనం విస్తరించి ఉందని, దీని ప్రభావంతో.. తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. శనివారం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. సోమవారం (సెప్టెంబర్ 23) వాయువ్య మరియు దాని పరిసర పశ్చిమ -మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు రెయిన్ అలర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు, నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో కొన్ని జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని 29 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ములుగు, భద్రాద్రి, నాగర్ కర్నూల్, ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమురం భీమ్, మెదక్, మల్కాజ్ గిరి, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, భువనగిరి జిల్లాలో మోస్తరు వర్షం నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఏపీలో సైతం భారీ వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సోమవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వచ్చే మూడు నాలుగు రోజుల పాటు పరిస్థితి ఇలానే ఉంటుందని నిర్ధారించింది. ఆదివారం మన్యం, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూగో, పగో, కృష్ణా, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా.. హైదరాబాద్‌ను భారీ వర్షం మరోసారి ముంచెత్తింది. శనివారం సాయంత్రం వేళ పలు ప్రాంతాల్లో గ్యాప్‌లు వారీగా దంచికొట్టిన వానతో నగరం తడిసి ముద్దయింది. హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై మోకాళ్ళ లోతు నీళ్లు పారడంతో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.. ఇవాళ కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# తిరుమల లడ్డూ ఆరోపణల మధ్య జగన్ అనూహ్యం



అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వును వాడిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చెలరేగుతున్న దుమారం తగ్గట్లేదు. చంద్రబాబు వ్యాఖ్యల అనంతరం చోటు చేసుకుంటోన్న పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోన్నాయి. కలియుగ వైకుంఠంలా అలరారుతున్న, సాక్షాత్ శ్రీమహావిష్ణువే కొలువుదీరిన తిరుమలపై, అక్కడి పవిత్రతపై, స్వామివారి లడ్డూ ప్రసాదంపై వివాదం చెలరేగడం అటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కోట్లాదిమంది హిందువులు, శ్రీవారి భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడం వల్ల అటు జాతీయ మీడియా సైతం దీనికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ పరిణామాల మధ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామాలన్నింటినీ వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఎనిమిది పేజీలు ఉన్న సుదీర్ఘ లేఖ ఇది. ఇందులో అనేక అంశాలను ప్రస్తావించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను ధ్వంసం చేసేలా, ఆలయ ప్రాధాన్యతను తగ్గించేలా చంద్రబాబు వ్యవహరిస్తోన్నారంటూ వైఎస్ జగన్ ఆ లేఖలో పేర్కొన్నారు. శ్రీవారికి ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు ఉన్నారని, ఎంతో సున్నితమైన ఈ అంశాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోన్నారంటూ విమర్శించారు. 100 రోజుల్లోనే చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయట్లేదని చెప్పారు. ఈ వ్యతిరేకత నుంచి బయటపడటానికి డైవర్షన్ పాలిటిక్స్‌ను తెరమీదికి తీసుకొచ్చారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇందులో భాగంగానే- తిరుమల, తిరుమల ఆలయం, శ్రీవారి లడ్డూ ప్రసాదం వంటి అత్యంత పవిత్రమైన, కోట్లాదిమంది హిందువుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలపై పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని చెప్పారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వును వాడుతున్నారనే అసత్యాలను ప్రచారం చేస్తోన్నారని, దీనివల్ల ఆలయ పవిత్రతను దెబ్బతీస్తోన్నారని అన్నారు. ల్యాబ్ రిపోర్ట్‌లోని అంశాలను వైఎస్ జగన్.. ఈ లేఖలో వివరించారు. జూన్ 4వ తేదీన రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, జులై 12వ తేదీన నెయ్యి శాంపిల్స్ తీసుకున్నారని, అందులో జంతువుల కొవ్వు కలిసి ఉందంటూ రిపోర్ట్ రావడంతో టీటీడీ దాన్ని లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించలేదని వివరించారు. అయినప్పటికీ- చంద్రబాబు తన అసత్య ప్రచారాలను మాత్రం మానుకోలేదని జగన్ చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రసాదాల తయారీలో టీటీడీ దశాబ్దాల కాలంగా నియమ, నిబంధనలను అనుసరిస్తోందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిఫారసు చేసిన ప్రముఖులను టీటీడీ పాలక మండలిలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఇప్పుడున్న టీటీడీ బోర్డులో కూడా కొందరు భారతీయ జనతా పార్టీ నాయకులు ఉన్నారని జగన్ తెలిపారు. స్వతంత్రంగా వ్యవహరించే పాలక మండలి కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం ఇందులో నామమాత్రంగా ఉంటుందని, పాలక మండలి భక్తుల ప్రయోజనాల కోసం సొంతంగా నిర్ణయాలను తీసుకుంటుందని చెప్పారు. శ్రీవారి ప్రసాదాల తయారీ కోసం వినియోగించే నెయ్యిని ఇ-టెండరింగ్ ప్రక్రియ ద్వారా సేకరిస్తుంటారని, ప్రతి ఆరు నెలలకోసారి ఈ టెండర్ల ప్రాసెస్‌ను చేపడుతుంటారని జగన్ వివరించారు. తక్కువ ధరను కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు నెయ్యిని సరఫరా చేసే బాధ్యతను అప్పగించడం బిడ్డింగ్ నిబంధనల్లో ఉందని అన్నారు.2014- 2019 మధ్యకాలంలో సహా దశాబ్దాల కాలంగా ఇదే ప్రక్రియ కొనసాగుతోందని జగన్ తెలిపారు. నెయ్యి ప్యూరిటీకి సంబంధించిన సర్టిఫికెట్‌ను ప్రతి ట్యాంకర్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీ అందజేస్తుంటుందని అన్నారు. ఆ తరువాత ప్రతి ట్యాంకర్ నుంచి మూడు శాంపిళ్లను టీటీడీ ఆలయం వద్ద సేకరిస్తారని, ఆ టెస్టుల్లో నెయ్యి శుద్ధమైనదేనని తేలిన తరువాత ప్రసాదాల తయారీకి వినియోగిస్తారని మోదీకి వివరించారు వైఎస్ జగన్. ఈ మూడింట్లో ఏ ఒక్క శాంపిల్ కూడా నెగెటివ్‌గా రిపోర్ట్ వస్తే ట్యాంకర్ మొత్తాన్నీ వెనక్కి పంపిస్తారని, ఆ నెయ్యిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించబోరని అన్నారు. 2014-19 మధ్యకాలంలో 15 సార్లు, తమ ప్రభుత్వ హయాంలో అంటే 2019 నుంచి 2024లో 18 సార్లు అలా నెయ్యి ట్యాంకర్లను తిప్పి పంపించినట్లు జగన్ స్పష్టం చేశారు. రెండు నెలల కిందట కూడా ట్యాంకర్లను తిప్పి పంపిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు ఎన్డీడీబీ కాల్ఫ్ రిపోర్ట్ ఆధారంగా చేసుకుని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015- 2018 మధ్యకాలంలో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్.. తిరుమలకు నెయ్యి సరఫరాను నిలిపివేసిందని వైఎస్ జగన్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రైవేటు సంస్థలే నెయ్యిని టీటీడీకి సరఫరా చేశాయని అన్నారు. అదేవిధంగా తమ ప్రభుత్వ హయాంలోనూ కొన్ని రోజులు కేఎంఎఫ్ నెయ్యిని పంపించలేదని పేర్కొన్నారు. తనకు బాగా అలవాటైన రీతిలో చంద్రబాబు చివరికి తిరుమలను సైతం తన రాజకీయాల కోసం వాడుకుంటోన్నారని, ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్లుగా వ్యవహరించట్లేదని జగన్ ఆరోపించారు. ఈ కీలక పరిస్థితుల్లో దేశం మొత్తం కూడా మీ వైపే చూస్తోందని, చంద్రబాబు ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను వెలికి తీయాలని దేశ ప్రజలు కోరుకుంటోన్నారని చెప్పారు.

## తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం..

# త్వరలో బీసీ రాజకీయ పార్టీ



హైదరబాద్ : బీసీల కోసం ప్రత్యేక రాజకీయ పార్టీ పెట్టాలనే డిమాండ్లు వస్తున్నాయని, తప్పకుండా పార్టీ పెడతామని రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ పార్టీ ప్రతిపాదన పరిశీలనలో ఉందని, సమయం కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఇవాళ హైదరాబాద్‌లో అఖిలపక్ష, బీసీ కులసంఘాల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, టీ కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌తో పాటు పలువురు బీసీ కులసంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గతంలో 10 మంది బీసీలు పార్టీ పెట్టినా సక్సెస్ కాలేకపోయారని గుర్తుచేశారు. కానీ ఈసారి తాము సరైన సమయం చూసి పార్టీ పెడతామన్నారు. ప్రభుత్వం కులగణన సమగ్రంగా చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో బీసీల పోరాటాన్ని వక్రీకరించారని, ఈ సారి మన రిజర్వేషన్లు సాధించుకోకపోతే రిజర్వేషన్లే లేకుండా చేస్తారని హెచ్చరించారు. రిజర్వేషన్ల పెంపుదల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు రాజ్యంగ సవరణ కోసం బీజేపీ ప్రభుత్వం దిగి రావాలన్నారు.

భారీ ఉద్యమం రాబోతోంది

కులగణన విషయంలో ప్రభుత్వం జీవో ఇస్తే ఆ జీవోపై వారి తరపున వాళ్లే మళ్లీ హైకోర్టుకు వెళ్లే ప్రమాదం ఉందని కృష్ణయ్య హెచ్చరించారు. అందువల్ల అలాంటి పరిస్థితే వస్తే ఎలా వ్యవహరించాలనే విషయాన్ని ముందుచూపుతో ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్లోని లోకల్ బాడీ ఎన్నికలపై సుప్రీంకోర్టులో కేసు నమోదైతే అన్ని కేసుల్లో బీసీలకు వ్యతిరేకమైన తీర్పే ఇచ్చారని చెప్పారు. తెలంగాణలోనూ ఇటువంటి ప్రమాదం ఉందని, అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. అవసరం అయితే రాష్ట్రంలో బంద్ నిర్వహిస్తామన్నారు. ఓ భారీ ఉద్యమం వస్తే తప్ప రిజర్వేషన్లు సాధ్యం కావన్నారు. గతంలో మండల్ కమిషన్ సమయంలోనూ 25శాతం మేర రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టివేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడితే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టిందని గుర్తుచేశారు. 2004లో బీసీ ఉద్యమం రావాల్సి ఉన్నా తెలంగాణ ఉద్యమంతో వెనక్కి వెళ్లిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం పెద్ద ఉద్యమమే రాబోతున్నదని.. ఆ సెగ కేంద్ర ప్రభుత్వం వరకు తాకబోతున్నదన్నారు. ఒక్కరోజులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చిన కేంద్రం బడుగుబలహీన వర్గాల కోసం రాజ్యాంగాన్ని సవరించలేదా? అని ప్రశ్నించారు. బిడ్డా.. మీరే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి పదవులు అనుభవిస్తూ బీసీలను ఓటర్లుగా మాత్రమే చూస్తారా? అని మండిపడ్డారు.

## తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్..

# దీని తెరవెనుక ఉన్నదెవరో?




హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్న సమయం లో ప్రధాన చర్చంతా హైదరాబాద్ మీదనే నడిచేది. తమిళనాడు నుంచి విడిపోయిన సందర్భంలో మద్రాస్ ను.. ఆపై ఉమ్మడి ఏపీ కోసం కర్నూలు రాజధానిని వదులుకున్నామని.. మన రాజధాని అని భావించి హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టామని ఇక్కడ సెటిలయిన, వ్యాపారాలు చేస్తున్న వారి తరఫున సీమాంధ్ర నాయకులు వాదించేవారు. ఇందులో ప్రజల కంటే సీమాంధ్ర నాయకుల ఆందోళనే ఎక్కువగా కనిపించేంది. మరోవైపు తెలంగాణ ప్రకటన జరిగాక కూడా అనేక అనుమానాలు, ఆందోళనలు. ఇక తెలంగాణ ప్రజల వాదన వేరేలా ఉండేది. ఉమ్మడి ఏపీ ఆవిర్భావం కంటే ముందే హైదరాబాద్ డెవలప్ అయిందని.. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నగరం ప్రత్యేకంగా ఎవరి ప్రమేయమూ లేకున్నా మరింత డెవలప్ అవుతుందని వ్యాఖ్యానించేవారు. హైదరాబాద్ పైనే పీటముడి ఉమ్మడి ఏపీ విభజన సందర్భంలో మిగతా తెలంగాణ వ్యాప్తంగా ఇబ్బంది లేకున్నా.. హైదరాబాద్ పైనే పీటముడి పడింది. అప్పటి రాజకీయ నాయకులు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టినవారి ప్రయోజనాలను స్టేక్ హోల్డర్స్ అంటూ తెరపైకి తెచ్చారు. అయితే, హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా 2014 నాటికి తెలంగాణ సాకారమైంది. ఈ గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగిసింది. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ లో సెటిలయిన సీమాంధ్రుల విషయమై తీవ్ర చర్చ జరిగింది. ఈ పదేళ్లలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ రాలేదు. కాగా, తెలంగాణ ఉద్యమ సమయంలోనే సీమాంధ్రుల పరిరక్షణ కంటూ కొన్ని సంఘాలు వెలిశాయి. తమ గొంతులు వినిపించాయి. చివరకు అంతా ప్రశాంశంగా ముగిసింది. పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు తీరి.. దాదాపు పదేళ్లు బీ(టీ)ఆర్ఎస్ అధికారం ముగిసిన తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేతికి పగ్గాలు వచ్చాయి. బీఆర్ఎస్ తెలంగాణలో తొలిసారిగా ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఇక ఇటీవలి పరిణామాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గాంధీ ఆంధ్రా వ్యక్తి అని అక్కడికే పంపిస్తామంటూ కౌశిక్ మాట్లాడారు. దీంతో బీఆర్ఎస్ మరోసారి తమ సెంటిమెంట్ ఆయుధమైన తెలంగాణవాదాన్ని ఎంచుకుంటోందా? అనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో ఓ కీలక ప్రకటన కనిపించింది. తెలంగాణ ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ అంటూ ఇటీవల ప్రధాన మీడియాలో ఓ ప్రకటన కనిపిస్తోంది. దీనికి అడుసుమిల్లి కల్యాణ్ ప్రెసిడెంట్ గా ప్రకటనలో ఉంది. తెలంగాణలో ఏపీ సెటిలర్ల గొంతుక అనేది వీరి ఉద్దేశం. తెలంగాణలో ఉన్న ఏపీ సెటిలర్స్ కుటుంబసభ్యులందరికీ ఫ్రంట్ ఆవిర్భావ శుభాకాంక్షలను తెలుపుతున్నారు. వాస్తవానికి తెలంగాణ, ఏపీ వాదనలు సమసి అంతా ప్రశాంతంగా ఉంది. తెలుపుతున్న రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయి. ఇలాంటి సమయంలో కౌశిక్ రెడ్డి రాయి వేశారు. దీంతోనే తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ ఉనికిలోకి వచ్చిందా? అనే అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్ భవిష్యత్ లో మళ్లీ తెలంగాణ వాదం వినిపిస్తే దానికి కౌంటర్ గా ఈ ఫ్రంట్ ను ముందుకుతెచ్చే ఉద్దేశం ఉందా? అనే ఊహాగానాలు వస్తున్నాయి. మరి దీని తెరవెనుక ఉన్నదెవరో?

## 300 పురాతన వస్తువులను ఇండియాకు తిరిగి ఇచ్చిన అమెరికా..



**న్యూఢిల్లీ,:** భారతదేశం నుండి అక్రమంగా తరలించబడిన అమూల్యమైన పురాతన వారసత్వాలను అమెరికా ఇండియాకు తిరిగి ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ ఈ 297 పురాతన వస్తువులను ప్రధాని మోడీకి అందజేశారు. దీంతో.. 2014 నుండి భారతదేశం నుండి స్వాధీనం చేసుకున్న పురాతన వస్తువుల మొత్తం సంఖ్య 640కి పెరిగింది. ఒక్క అమెరికానే 578 వస్తువులను తిరిగి ఇచ్చింది. 2021లో అమెరికా ప్రభుత్వం 157 పురాతన వస్తువులను అందజేసింది. ఇందులో 12వ శతాబ్దానికి చెందిన అద్భుతమైన కాంస్య నటరాజ విగ్రహం కూడా ఉంది. క్వాడ్ సదస్సులో పాల్గొనేందుకు అమెరికాకు వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ.. భారత్‌కు చెందిన 297 పురాతన వస్తువులు తిరిగి ఇచ్చేందుకు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక భారత్‌కు చెందిన పురాతన వస్తువులు తిరిగి అప్పగిస్తున్నందుకు అమెరికా ప్రభుత్వానికి మోడీ ధన్యవాదాలు తెలిపారు. దీని వల్ల సాంస్కృతిక వస్తువులను అక్రమ రవాణా చేయడాన్ని నిరోధించవచ్చని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. అంతకుముందు.. 2023లో ప్రధాని అమెరికా పర్యటనకు వెళ్లిన కొద్ది రోజుల తర్వాత, 105 పురాతన వస్తువులు భారతదేశానికి తిరిగి వచ్చాయి. భారత్‌కు సంబంధించిన పురాతన వస్తువులను వివిధ దేశాల నుంచి వెనక్కి తీసుకురావడానికి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. ఇందులో బ్రిటన్ నుండి 16 కళాఖండాలు, ఆస్ట్రేలియా నుండి 40 మరియు ఇతర ప్రాంతాల నుండి తిరిగి వచ్చాయి. అదే సమయంలో, 2004-2013 మధ్య ఒక కళాఖండం మాత్రమే భారతదేశానికి తిరిగి వచ్చింది. ఈ ఏడాది జులైలో ఢిల్లీలో జరిగిన 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో సాంస్కృతిక వస్తువులను తిరిగి రప్పించడంపై అమెరికా- భారత్‌ల మధ్య ఒప్పందం జరిగింది. భారత్ నుంచి అమెరికాకు కళాఖండాల అక్రమ రవాణాను నిరోధించడం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం కోసం రెండు దేశాలు ఈ ఒప్పందాన్ని చేసుకున్నాయి.

## రాహుల్ బాబా మేముండగా ఆ పని ఎన్నటికీ జరగదు..



**న్యూఢిల్లీ,:** రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) నాయకుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పహారీలు, గుజ్జర్లు, దళితులతో సహా అణగారిని వర్గాలకు రిజర్వేషన్లు అలాగే ఉంటాయని అమిత్ షా హామీ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో నౌషేరాలో జరిగిన ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. రిజర్వేషన్లు అవసరం లేదని రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన ప్రకటనని ప్రస్తావిస్తూ.. రిజర్వేషన్లను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. "పహారీ, గుజ్జర్ బకర్వాల్, దళితులు, వాల్మీకి, ఓబీసీ వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్‌పై పునరాలోచన చేస్తామని కాంగ్రెస్, ఎన్సీ చెప్పాయి. రాహుల్ గాంధీ అమెరికా వెళ్లి ఇప్పుడు వాళ్లు అభివృద్ధి చెందారని, ఇప్పుడు రిజర్వేషన్ అవసరం లేదని చెప్పారు. రాహుల్ బాబా, మేము మిమ్మల్ని రిజర్వేషన్‌ని తీసివేయనివ్వము" అని అమిత్ షా అన్నారు. రిజర్వేషన్లు యథాతథంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని ఎన్సీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆర్టికల్ 370ని తిరిగి తీసుకురాలేరు అని పేర్కొన్నారు. ప్రధాని మోడీ హయాంలో జమ్మూ కాశ్మీర్ రాళ్ల దాడిని లేదని, ఉగ్రవాదుల్ని విడుదల చేయలేదని అమిత్ షా అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్తాన్‌తో చర్చలు ఉండవని చెప్పారు. పాకిస్తాన్‌తో కాకుండా మేము కాశ్మీర్ యువతతో మాట్లాడుతామని చెప్పారు. టెర్రరిస్టులు, రాళ్లు రువ్వే వారి విడుదలకు ఎన్సీ-కాంగ్రెస్ కూటమి మద్దతిస్తోందని హోం మంత్రి ఆరోపించారు. ఉగ్రవాదాన్ని భూమిలో పాతిపెడుతామని వార్నింగ్ ఇచ్చారు.

## రాజకీయ లబ్ధి కోసం శ్రీవారిని కూడా వదలడం లేదు..



### రోజా కీలక వ్యాఖ్యలు

**అమరావతి,:** చంద్రబాబు 100 రోజుల పాలనలో జరిగిన అఘాయిత్యాలను కప్పి పుచ్చేందుకు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి రోజా వ్యాఖ్యానించారు. వరదలు, మహిళలపై వరుసగా జరుగుతున్న దాడులు, వైసీపీ నాయకులపై దాడులు, ఇచ్చిన హామీలు చంద్రబాబు నెరవేర్చలేకపోయాడని విమర్శించారు. ఇన్ని తప్పులు చేసిన చంద్రబాబు ప్రజల దృష్టి మళ్లించే విధంగా లడ్డు వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. తన రాజకీయ లబ్ధి కోసం వెంకటేశ్వర స్వామిని సైతం చంద్రబాబు వదలడం లేదన్నారు చెడ్డ పేరు వచ్చిన ప్రతిసారి ఇలాంటి వివాదాలు ఏదొకటి తెరపైకి తెచ్చి, పార్టీ నేతలతో ప్రచారం చేయిస్తున్నారని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రజలు ఖండిస్తున్నారు, ఛీకొడుతున్నారని రోజా వ్యాఖ్యానించారు. టీటీడీ స్వయం ప్రతిపత్తి సంస్థ, సీఎంకు ఎలాంటి సంబంధం ఉండదని మంత్రి లోకేష్ అంటున్నారని తెలిపారు. జగన్ అనిమల్ ఫ్యాట్ మిక్స్ చేయించినట్లుగా చంద్రబాబు సృష్టిస్తున్నారన్నారు. చంద్రబాబు ఆరోపణలు సమంజసం కాదన్నారు. ఈఓ శ్యామల రావు బాధ్యతలు తీసుకున్న వెంటనే స్వచ్ఛమైన నెయ్యిని వాడుతున్నట్లు తెలిపారని.. అనంతరం జులై 23న వెజిటబుల్ ఆయిల్ మిక్స్ చేశారు అందుకే నెయ్యిని వెనక్కు పంపాం అంటూ ఈవో స్టేట్మెంట్ ఇచ్చారన్నారు. రెండు నెలల అనంతరం సీఎం స్టేట్మెంట్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టి నింద వేశారని పేర్కొన్నారు. మళ్లీ శ్యామలరావుపై ఒత్తిడి తెచ్చి ప్రెస్ మీట్ పెట్టించారని ఆమె తెలిపారు. మీ ప్రభుత్వంలో బయటపడిన అంశం కాబట్టి బాధ్యులు ఎవరు? సీఎం చంద్రబాబునా? ఈవో శ్యామలరావునా అంటూ రోజా ప్రశ్నించారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోడీ, సీజేఐలు, చంద్రబాబు సైతం ఫ్యామిలీతో రావడం జరిగిందన్నారు. లడ్డూ రుచిలో తేడా ఉంటే ఆ రోజే కంప్లైంట్ ఇవ్వాలి కదా అంటూ ప్రశ్నించారు. ఐదేళ్లలో ఏదో జరిగిందని నింద వేయడానికి కల్తీ నెయ్యి అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. టీటీడీ ప్రతిష్టను దిగజార్చే విధంగా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు సైతం గత పాలక మండలిలో ఉన్నారు అప్పుడు ఎందుకు కంప్లైంట్ చేయలేదని ప్రశ్నలు గుప్పించారు. ప్రస్తుతం టీడీపీలో ఉన్న వేమిరెడ్డి ప్రశాంతి, పార్థసారథి గత పాలకమండలిలో ఉన్నారు తప్పు చేశారా లేదా వాళ్లైనా చెప్పాలన్నారు. ఈరోజు ప్రాయశ్చిత దీక్ష చేస్తానని పవన్ కళ్యాణ్ ప్రకటించారని, ప్రాయిశ్చిత్తం ఎవరు చేస్తారని ఆమె ప్రశ్నించారు. తప్పుచేసినవారు చేస్తారు అంటే ప్రభుత్వంలో ఉన్నామని, టీడీపీ పాపంలో భాగం ఉంది కనుక దీక్ష చేస్తున్నానని ఆయనే ఒప్పుకున్నారని రోజా పేర్కొన్నారు.

## తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో పిటిషన్..



**అమరావతి,:** తిరుపతి లడ్డూ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఒక్కసారి హిందువులు, భక్తుల్లో ఆందోళన మొదలైంది. ఈ వివాదం పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఏపీలో అధికార, విపక్షాల మధ్య విమర్శలు ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే, ఈ ఘటనపై ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ నివేదిక కోరింది. కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా దీనిపై స్పందించారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తిరుపతి లడ్డూల్లో జంతువుల కొవ్వు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. భక్తులకు నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వుతో తయారుచేసిన లడ్డూ ప్రసాదాన్ని అందించారని హిందూ సేన అధ్యక్షుడు సుర్జిత్ సింగ్ యాదవ్ పిటిషన్ దాఖలు చేశారు. హిందూ మతాన్ని అపహాస్యం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నాడు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో "లడ్డూ ప్రసాదం" తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించారనే ఆరోపణ హిందూ సమాజం యొక్క మనస్సాక్షిని కదిలించిందని,భ్యుల మతపరమైన భావాలు, మనోభావాలను ఆగ్రహానికి గురి చేసిందని పిటిషన్ పేర్కొంది. ఈ కేసు ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉందని పిటిషనర్ పేర్కొన్నారు.

# గ్లోబల్ సిటీకి మరో నగిషీ



గ్లోబల్ సిటీగా దినదినాభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం నాలుగో నగరానికి నాంది పలికింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలకు తోడుగా సైబరాబాద్ ఏర్పడినప్పటికీ రోజురోజుకూ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య పెరగడాన్ని పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. పెట్టుబడులను ఆకట్టుకోవడంతో పాటు నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందిపుచ్చుకోవాలనుకునే ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇదో మెరుగైన అవకాశంగా అభివర్ణిస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే హైదరాబాద్ శివారులో సకల సౌకర్యాలతో నాలుగో నగరం దర్శనం ఇవ్వబోతుంది. దాదాపు 14 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు కానుంది. దేశవ్యాప్తంగా 2010లో 700 వరకు ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2023 నాటికి 1600 లకు పెరిగింది. 2028 నాటికి వీటి సంఖ్య 2,100కు చేరుకుంటుందని భావిస్తున్నారు. దేశంలోని ఆరు ఐటీ నగరాల్లో కొత్తగా ఏర్పడనున్న జీసీసీలు 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకుంటాయని పరిశ్రమ వర్గాలు భావించాయి. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ప్రభు త్వం ముందుచూపుతో వ్యవహరిస్తూ నాలుగో నగరానికి నాంది పలికింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలకు చెందిన అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలకు పొరుగు, ప్రాసెస్ సేవ లను అందించేందుకు నైపుణ్యంతో పాటు చవకగా మానవ వనరులు లభించే ఇతర దేశాల్లో ఉప కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఆ విధంగా ఇప్పటికే అనేక సంస్థలు హైదరాబాద్‌లో ఉప కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పించాయి. నైపుణ్యమే అర్హతగా వార్షిక వేతనాలను కనీసం 5.7 లక్షల నుండి 21.8 లక్షల రూపాయల వరకు చెల్లిస్తున్నాయి. దీంతో దేశ, విదేశీ నిపుణులకు హైదరాబాద్ పని ప్రాంతంగా విరాజిల్లుతోంది.

### హైదరాబాద్ శివారులో ఫ్యూచర్ సిటీ

తెలంగాణకు ప్రాధాన్యమిస్తున్న కార్పొరేట్ సంస్థ లను పరిగణలోకి తీసుకొని, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం, స్థానికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో మెరుగైన వేతన వ్యవస్థలతో వారిని ఆర్థికంగా పరిపుష్టం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ ఆలోచన చేశారు. నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో ఫ్యూచర్ సిటీ ఆలోచన కార్యరూపం దాల్చింది. మరికొద్ది రోజుల్లోనే హైదరాబాద్ శివారులో సకల సౌకర్యాలతో నాలుగో నగరం దర్శనం ఇవ్వబోతుంది. దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో 20 శాతానికి పైగా హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయి. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉండటం, తక్కువ జీవన వ్యయం, అనుకూల ప్రభుత్వ విధానాల కారణంగా ఆయా ఐటీ సంస్థలు బెంగుళూరు తర్వాత హైదరాబాద్‌కు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి.

### కొలువుదీరనున్న గ్లోబల్ సంస్థలు..

సైబరాబాద్ ఇప్పటికే ఐటీ కంపెనీలతో నిండిపోయింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఐటీ కంపెనీలు ఏర్పటవుతున్నాయి. కొత్తగా తమ కార్యకలాపాలను హైదరాబాద్ నుండి ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్న ప్రపంచ దేశాల సంస్థలకు అవసరమైన ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉంచే దుకు ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని సకల సౌకర్యాలతో అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి మహేశ్వరం, కందు కూరు, ఇబ్రహీంపట్నం, మండలాల్లో భూసేకరణ చేపట్టింది. ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీతో పాటు ప్రఖ్యాత సంస్థలు, పరిశ్రమలు కొలువుదీరనున్నాయి. దాదాపు 14 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు కానుంది. అందులో విద్య, ఎలక్ట్రానిక్స్, ఔషధం, పర్యాటకం అని నాలుగు జోన్లను ఏర్పాటు చేస్తున్నారు.

### 2 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు..

దాదాపు 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫార్మా కంపెనీలు, వెయ్యి ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సిటీ, మరో వెయ్యి ఎకరాల్లో జపాన్ కంపెనీ పార్క్ ఏర్పాటు కానుంది. ఫ్యూచర్ సిటీలో 2 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు ఏర్పడగలవని భావిస్తున్నారు. 'ఫ్యూచర్ సిటీ' న్యూయార్క్‌ను తలదన్నేలా ఉంటుందని, మౌలిక వసతులు చూసి ప్రపంచ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు బారులు కడతాయని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఆయన కలలను నిజం చేసే దిశగా 13,972 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో నగర నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామిక ప్రగతి అత్యంత కీలకం. వ్యవ సాయం, పరిశ్రమలు సమాంతరంగా వృద్ధి సాధించడం ద్వారానే రాష్ట్రం ఆర్థిక ప్రగతిని సాధిస్తుంది. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంతో పేదరికం తగ్గుముఖం పడుతుంది. కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించగలుగుతాయి. ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించగలవు అనే ముఖ్యమంత్రి ఆలోచనలు మరింత దూరదృష్టితో ముందుకు సాగాలని ఆశిద్దాం.

# ఎమర్జెన్సీ సినిమాపై కోపం ఎందుకు?

1975 ఎమర్జెన్సీ భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ప్రధాని ఇందిరాగాంధీ 1975లో ఎమర్జెన్సీని ఎందుకు విధించినట్లు? ఎమర్జెన్సీ కాలంలో పత్రికలు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాస్వామ్యవాదులు ఎలాంటి ఇబ్బందులను, అణచివేతలను ఎదుర్కొన్నారు అనే విషయం నేటి యువతకు తెలియదు. ఎమర్జెన్సీ పరిస్థితులను కథా వస్తువుగా సినీనటి, లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో, తానే ప్రధాన పాత్రగా (ఇందిరాగాంధీ) ఎమర్జెన్సీ సినిమాను తీస్తున్నారు. ఈ సినిమా విషయంలో కంగనా రనౌత్ పెద్ద సాహసమే చేశారని చెప్పాలి. చారిత్రిక సత్యాలను సినిమాల ద్వారా చూపిస్తే ఈ దేశంలో చాలామందికి నచ్చదు. మరీ కుల పిచ్చితో, మత పిచ్చితో కునారిల్లే వర్గాలకు ఎమర్జెన్సీ సినిమా కథా వస్తువు ఇబ్బందిని కలిగిస్తుంది. ఎమర్జెన్సీ అకృత్యాల గరించి మాట్లాడితే కాంగ్రెస్ నాయ కులు అగ్గి మీద గుగ్గిలమవుతారు. పంజాబ్ రాష్ట్రంలో ప్రజాదరణ కలిగిన అకాలీ దళ్ పార్టీని బలహీనపరచడానికి మతోన్మాద భావజాలం ఉన్న బింద్రెన్ వాలేను, అతని అనుచరులను స్వయానా ఇందిరాగాంధీ పెంచి పోషించారు.

హత్యానంతరం సంఘటనలు చూపించకపోయినా..

'పాముకు పాలు పోస్తే కాటేసిన చందంగా' ఆమె పెంచి పోషించిన ఖలిస్తాన్ ఉగ్రవాదమే ఆమెను కాటేసింది. సిక్కు తీవ్రవాదం బలపడి, భారతదేశ సమగ్రతకు ఒక సవాలుగా మారింది. బింద్రెన్ వాలా అమృత్ సర్ స్వర్ణ దేవాలయాన్ని తీవ్రవాదులకు కేంద్రంగా మార్చడంతో.. భారత సైన్యం 'ఆపరేషన్ బ్లూ స్టార్' పేరుతో స్వర్ణ దేవాలయంలో దాక్కున్న సిక్కు తీవ్రవాదులను మట్టుపెట్టడం జరిగింది. ఈ ఆపరేషన్‌కు అనుమతించిన ఇందిరా గాంధీని సిక్కు బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లు అతి కిరాతకంగా కాల్చి చంపారు. ఇందిరా గాంధీ హత్యానంతరం దేశంలో అనేక ప్రాంతాల్లో అమాయకపు సిక్కులు నరమేధానికి గురయ్యారు. ఈ విషయాలను ఎమర్జెన్సీ సినిమాలో కొంతమేరకు చూపించినా, చూపించకపోయినా సత్యం దాగదు! అయితే ఇప్పుడు ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వరాదు అంటూ శిరోమణి గురుద్వారా ప్రబంధ కమిటీ లేఖ రాయడం లోతుగా ఆలోచించాల్సిన విషయమే! ఈ సినిమా విషయంలో సిక్కులు ఎందుకు ఆందోళన చెందుతున్నారు? ఖలిస్తాన్ ఉద్యమం పంజాబ్ రాష్ట్రంలో సృష్టించిన అరాచక పరిస్థితులను ప్రజలు తెలుసుకుంటారని సిక్కు నాయకులు భయపడుతున్నారా?

### కాంగ్రెస్‌కి ఎందుకు భయం?

అధికార దాహంతో తీవ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న సంస్థలను సమర్థించడం, అక్కున చేర్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి





అలవాటైన విషయమే! దేశంలో ముస్లింల ఓటు బ్యాంకు కోసం ఇస్లామిక్ తీవ్రవాదులను కాంగ్రెస్ పార్టీ పెంచి పోషించింది. బర్మా, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయమిచ్చి, భారతీయ పౌరులుగా మార్చింది. ఈ కారణంగానే ఎన్ఆర్సీ, సీఏఏలను వ్యతిరేకిస్తోంది. ఇలాంటి దేశద్రోహపు పనిని ప్రపంచంలోని ఏ రాజకీయ పార్టీ చేయదు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ, నటిస్తున్నందుకు కంగనా రనౌత్ తలతీస్తామని, ఇందిరాగాంధీకి పట్టిన గతి ఏమిటో తెలుసుకోవాలని ఆమెకు వీడియోలు పంపడం, సిక్కు నాయకుల చేత హెచ్చరికలు జారీ చేయించడం వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తం లేదని చెప్పడం అసాధ్యం. వాస్తవ విషయం అర్థం చేసుకున్న కంగనా రనౌత్ ఈ సినిమా రిలీజ్ విషయంలో సహకరించాలని ప్రతిపక్ష నాయ కుడు రాహుల్ గాంధీని కోరడం కొసమెరుపు. ఈ సినిమా చూస్తే ఎమర్జెన్సీ పరిస్థితులు, ఎమర్జెన్సీ ఆకృత్యాలు దేశ ప్రజలకు తెలిసి, కాంగ్రెస్ పార్టీని ప్రజలు అసహ్యించుకుంటారేమో అనే భయం కాంగ్రెస్ నాయకులకు ఏర్పడినట్లు ఉంది. అందుకే శిరోమణి గురుద్వారా ప్రబంధ కమిటీని రెచ్చగొట్టింది. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడిపే రైతు ఉద్యమం వెనుక ఈ కమిటీ అనుయాయులు చాలామంది ఉన్నారనే విషయం అర్థమైతే కాంగ్రెస్ పార్టీకి సిక్కు నాయకులు ఉన్న సంబంధం ఏమిటో స్పష్టం అవుతుంది.

### ఎవరూ మద్దతు తెలుపలేదు..

కంగనా రనౌత్‌కు వ్యతిరేకంగా జారీ అయిన హెచ్చరికల విషయంలో నెటిజెన్లు ఆమెకు మద్దతుగా నిలిచారు. మానవహక్కుల సంఘా ల వాళ్లు, ప్రజాస్వామ్యవాదులమని బోర్డులు తగిలించుకున్న వారు మాత్రం ఈ విషయంపై నోరు మెదపకపోవడం ఆశ్చర్యం కలిగించదు. కానీ బాలీవుడ్ సినీరంగం ఆమెకు బాసటగా నిలవకపోవడం సినిమా వాళ్ల మానసిక దౌర్భాగ్యాన్ని తెలియజేస్తుంది. హిందూ సమాజంలోని అగ్రకులాల దౌర్జన్యాలను కథావస్తువుగా చూపించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి సినిమాలు నిర్మించిన వాళ్లను మట్టుపెడతామని అగ్రకులాలకు చెందినవారు చెలరేగిపోయిన దాఖలాలు లేవు. మరి ఎమర్జెన్సీ సినిమా విషయంలో సిక్కు నాయకుల గాండ్రిం పులు ఎందుకు? అనవసరంగా ఒక లేడీ కానిస్టేబుల్ ఆమెపై చేయి చేసుకున్నప్పుడు సినీరంగం ఆమెకు సంఘీభావం తెలపలేదు. అందుకు కారణం ఆమె హిందుత్వవాది కావడమే! ఆమె అధికార పార్టీ ఎంపీ అయినప్పటికీ ఆమెకు ప్రభుత్వం నుంచి అండ లభించలేదు. ఆమె అంటే గిట్టని వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా, రాజపుత్ర స్త్రీగా కంగనా రనౌత్ ఎమర్జెన్సీ సినిమా విడుదలను అడ్డుకోవాలని ప్రయత్నించే వారికి ధైర్యంగా 'ప్రతి సవాలు' విసరడం వీరోచిత చర్యగా భావించక తప్పదు.

# నీళ్ల మంటలు!



### తమసోమా జ్యోతిర్గమయ

సింధు నదీజలాల ఒప్పందాన్ని సవరించుకుందామంటూ ఇటీవల భారతదేశం ఇచ్చిన నోటీసుకు పాకిస్థాన్ తనదైన ధోరణిలో స్పందించింది. ఆరుదశాబ్దాలనాటి ఆ ఒప్పందాన్ని సమీక్షించి, సవరించుకోవాలని భారత ప్రభుత్వం గత ఏడాది కూడా పాకిస్థాన్‌ను డిమాండ్ చేసింది. అప్పట్లో తీవ్రంగా స్పందించిన పాకిస్థాన్ ఈ మారు మాత్రం కాస్తంత తగ్గింది. పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని ఎంతో గౌరవిస్తుందని, భారత్ కూడా అలాగే భావిస్తూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని హితవుచెప్పింది. తొమ్మిదేళ్ళ సుదీర్ఘచర్చల అనంతరం 1960లో నెహ్రూ-అయూబ్‌ఖాన్ సంతకాలు చేసిన ఈ ఒప్పందంలో పటిష్టమైన నిబంధనలు, పలుదశల వివాద పరిష్కారమార్గాలు ఉన్నందునే అది ఇప్పటికీ బలంగా నిలబడింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీజలాల పంపకాలకు ఇది ఆదర్శమని కూడా అంటారు. మరీముఖ్యంగా, భారత్-పాకిస్థాన్ మధ్య ఇన్ని దశాబ్దాలుగా వీసమెత్తు సయోధ్య లేకున్నా, చివరకు యుద్ధాలు జరిగినా ఈ ఒప్పందం నిలిచింది. అయితే, కిషన్‌గంగ, రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టుల విషయంలో రెండుదేశాల మధ్యా ఉన్న వివాదం ఈ ఒప్పందాన్ని ప్రమాదంలో పడవేసేట్టు కనిపిస్తోంది. పరిస్థితులు, అవసరాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ఒప్పందాన్ని తిరగరాసుకోవాలని భారత్ వాదిస్తూ, పెరిగిన జనాభా, క్లీన్ ఎనర్జీ, పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం తదితర కారణాలను భారత్ ప్రస్తావించింది. నోటీసులు ఇవ్వడానికి ఇవన్నీ సముచిత కారణాలేనన్నది అటుంచితే, సరిహద్దు ఉగ్రవాదం హెచ్చినప్పుడో, కశ్మీర్‌తో అవసరాలు పెరిగినప్పుడో ఈ ఒప్పందాన్ని భారత్ తరచుగా పాకిస్థాన్‌కు గుర్తుచేస్తూ ఉంటుంది. గత ఏడాది ఇచ్చిన నోటీసుకు ఇప్పటిది కొనసాగింపు మాత్రమేనని, ఈ రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల విషయంలో పాకిస్థాన్ ఒత్తిడికి లొంగకూడదన్న పట్టుదలతోనే భారత్ ఈ విధంగా వ్యవహరిస్తున్నదని అంటారు. సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా సింధు, జీలం, చీనాబ్ నదులు పాకిస్థాన్‌కు దక్కాయి. రావి, బియాస్, సట్లెజ్ భారతదేశానికి వచ్చాయి. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిగా కుదిరిన ఈ ఒప్పందం సజావుగా అమలుజరగడానికి సింధు శాశ్వత కమిషన్ ఏర్పాటైంది, రెండు దేశాలనుంచి అందులో కమిషనర్లు ఉన్నారు. చీనాబ్, జీలం నదులమీద జమ్మూకశ్మీర్‌లో ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల అంశాన్ని ద్వైపాక్షిక చర్చలతో పరిష్కరించుకోవచ్చునన్నది భారత్ వాదన. కానీ, తనవాటా నదులమీద వీటి నిర్మాణంపై పాకిస్థాన్ దశాబ్దంన్నరకాలంగా రచ్చచేస్తున్నది. భారత్ స్వేచ్ఛగా ఉపయోగించుకోగలిగే జలాల పరిధిలోనే ఈ ప్రాజెక్టులు ఉన్నా, ఆ జలాలను విద్యుత్ వినియోగానికి తప్ప భారత్ ఇతరత్రా వినియోగించుకోకున్నా, ప్రవాహాలకు ఆటంకం కాకున్నా ఈ ప్రాజెక్టులను పాకిస్థాన్ వ్యతిరేకిస్తోంది. నిజానికి హేగ్ ఆర్బిట్రేషన్‌కోర్టు అనుమతించిన మేరకే జీలం నదిమీద కిషన్‌గంగ ప్రాజెక్టు పూర్తయింది. చీనాబ్ మీద రాటిల్ మాత్రం పూర్తికాని స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో, సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా వివాద పరిష్కారానికి తటస్థ నిపుణుడిని నియమించవలసిందిగా పాకిస్థాన్ ప్రపంచబ్యాంకును 2015లో కోరింది. అది జరిగిన మరుసటి ఏడాది పాకిస్థాన్ ఆ ప్రతిపాదన ఉపసంహరించుకొని, హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టునుంచి న్యాయం కావాలన్నది. ఇందుకు కూడా ప్రపంచబ్యాంకు తలూపడంతో భారత్‌కు ఆగ్రహం కలిగింది. అంతవరకూ తటస్థ నిపుణుడికి సహకరించిన భారతదేశం హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టు విచారణకు మాత్రం గైర్హాజరైంది. తనకు దక్కాల్సిన నీటిని ఈ రెండు ప్రాజెక్టులు అడ్డుకుంటున్నాయన్న పాకిస్థాన్ ఆరోపణకు తగిన ఆధారాలు లేవని భారతదేశం అంటోంది. పాక్ ఒత్తిడికి లొంగి ప్రపంచబ్యాంకు ఏకకాలంలో రెండు సమాంతర ప్రక్రియలకు అనుమతించడం సరికాదనీ, భిన్నమైన తీర్పులతో మరింత గందరగోళం ఏర్పడుతుందనీ భారత్ వాదన. వివాద పరిష్కారానికి తనకు అర్హత ఉన్నదని హేగ్ కోర్టు ఇటీవల చెప్పినప్పటికీ, ముందుగా తటస్థ నిపుణుడే అమీతుమీ తేల్చాలని భారత్ వాదన. హేగ్ కోర్టు తీర్పును అడ్డుకోవడానికే సింధునదీజలాల ఒప్పందాన్ని తిరగదోడాలన్న ప్రతిపాదన భారత్ తెస్తోందని పాకిస్థాన్ ఆరోపణ. 850 మెగావాట్ల రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టును రక్షించుకోవడానికి వీలుగా, పాకిస్థాన్ మెడలు వంచేందుకు భారత్ ఈ ప్రతిపాదన చేస్తున్నదని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

# కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్లకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ(ఆదివారం) తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ అభిమానులు ఉన్నారని. ఏం జరిగినా తమకు తెలుస్తుందని చెప్పారు తప్పకుండా అన్నీ బయటకు వస్తాయని , అన్నీ బయట పెడతామని కేటీఆర్ హెచ్చరించారు.

### రేవంత్ రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉండాలి..

ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. రేవంత్ రెడ్డి పదవిని లాక్కోడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప ఉద్యోగాలు పోయినట్లే రేవంత్ కూడా తన ఉద్యోగం కోల్పోబోతున్నాడని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### సీఎం కుటుంబ సభ్యుల అవినీతిని తేలుస్తాం..

తన బావమరిదికి అక్రమంగా టెండర్లు కట్టబెట్టిన వ్యవహారం రేవంత్ మెడకు చుట్టుకుంటుందని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తరచుగా చెబుతున్న ఫోర్త్ సిటీ కాదని.. ముచ్చర్ల ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఆరోపించారు. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన తమకు ఎక్కడ అవినీతి జరుగుతుందో తెలియదా? అని అన్నారు. కొడంగల్ లిఫ్ట్ కథ సహా.. సీఎం కుటుంబ సభ్యుల అవినీతిని తేలుస్తామని కేటీఆర్ అన్నారు. బావమరిది వ్యవహారంలో ఇరికిపోయానని సీఎంకు కూడా తెలుసునని అన్నారు. చట్టాలే కాదు.. చుట్టరికాలు కూడా ప్రభుత్వ పెద్దలకు తెలియనట్లుందని కేటీఆర్ విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సీజే వద్దకు మంత్రి పొంగులేటి తనతో కలిసి రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు.

# బెంగాల్ వరదలపై ప్రధానికి దీదీ రెండో లేఖ



కోల్‌కతా: తమ రాష్ట్రంలో సంభవించిన వరదలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి రెండో లేఖ రాశారు. రాష్ట్రంలో 50లక్షల మంది ప్రజలు వరదల బారిన పడి తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే కేంద్రం నిధులు మంజూరు చేయాలని ఆమె ఈ లేఖలో కోరారు. తమ ప్రభుత్వ అనుమతి లేకుండా దామోదర్ వ్యాలీ కార్పోరేషన్ రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడంతో అనేక జిల్లాలు నీట మునిగాయని పేర్కొన్నారు. ప్రధానికి రాసిన తొలి లేఖపై కేంద్ర జలశక్తి మంత్రి సి ఆర్ పాటిల్ స్పందిస్తూ.. డీవీసీ రిజర్వాయర్ల నుంచి నీటి విడుదలపై ప్రతి దశలోనూ రాష్ట్ర అధికారులకు తగిన సమాచారం ఇచ్చామని వివరణ ఇచ్చారు. దీనిపై బెనర్జీ స్పందిస్తూ..."డీవీసీ డ్యామ్‌ల నుంచి నీటి విడుదల అనేది దామోదర్ వ్యాలీ రిజర్వాయర్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి, సహకారంతో జరుగుతుంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రతినిధులతో కూడా సంప్రదించాల్సి ఉంటుంది. అయితే.. అలా జరగలేదు. అన్ని కీలక నిర్ణయాలను కేంద్ర జల కమిషన్ ప్రతినిధులు, జలశక్తి మంత్రిత్వశాఖ, కేంద్రం ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా తీసుకున్నారు" అని ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో రాష్ట్రప్రభుత్వానికి ఎటువంటి నోటీసులు లేకుండా నీటిని విడుదల చేశారని మమతా తప్పుపట్టారు. రాష్ట్ర అభిప్రాయాలను కనీసం గౌరవించలేదన్నారు. ఇక రిజర్వాయర్ల నుంచి నీటిని తొమ్మిది గంటల పాటు ఏకధాటిగా విడుదల చేయడానికి ముందు స్వల్ప వ్యవధిలో సమాచారం ఇచ్చారన్నారు. ఆ కొద్దిసేపట్లో అత్యవసర సహాయక చర్యలు తీసుకోవడం సాధ్యం కాదన్నారు.

# ఎన్నికల హామీలన్నీ కచ్చితంగా నెరవేరుస్తాం..



**అమరావతి,:** కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన చాలా బాగుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో మాట్లాడుతూ.. ప్రజలు ఏం కోరుకున్నారో అలాంటి పాలన అందించగలిగామన్నారు. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు తోడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నూతన ఆలోచనతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం నడుస్తుందన్నారు. తెనాలిలో 100 రోజుల్లో గంజాయిని అరికట్టగలిగామన్నారు. ఇప్పటికే 80శాతం గంజాయిని నిర్మూలించామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం, త్వరలోనే వాట్సాప్ నెంబర్‌ను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

## 'ఇప్పటికీ అర్థం కాలేదంటే..' హెజ్‌బొల్లాకు నెతన్యాహు హెచ్చరిక!



ఇంటర్నెట్ డెస్క్: ఇటీవలి కాలంలో హెజ్‌బొల్లాను ఊహించని విధంగా దెబ్బకొట్టామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందేశాన్ని హెజ్‌బొల్లా ఇప్పటికీ అర్థం చేసుకోకపోతే.. త్వరలోనే అర్థం చేసుకుంటుందన్నారు. రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఉత్తర ఇజ్రాయెల్‌లో దాడులు జరుపుతున్న హెజ్‌బొల్లాపై.. నెతన్యాహు సైన్యం కూడా దీటుగా ప్రతిస్పందిస్తోంది. దక్షిణ లెబనాన్‌లో యుద్ధవిమానాలతో తీవ్ర దాడులు చేసింది. శనివారం ఒక్కరోజే 290 లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఈక్రమంలో ఏకంగా 16 మంది అగ్రశేణి కమాండర్లను హెజ్‌బొల్లా కోల్పోయింది. ఇలా ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఆదివారం కూడా భీకర దాడులు కొనసాగాయి. మొత్తంగా ఇజ్రాయెల్ దాడుల్లో 39 మంది చనిపోగా.. 3వేల మంది గాయాలపాలైనట్లు అంచనా.

## సీఎల్పీ భేటీ.. హాజరైన అరెకపూడి గాంధీ, దానం, ప్రకాశ్‌గౌడ్, కడియం



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష(సీఎల్పీ) సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించనున్నారు. రాష్ట్ర రాజకీయాలు, బీసీ కులగణన, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. నూతన పీసీసీ అధ్యక్షుడిని నియమించినప్పుడు సీఎల్పీ సమావేశం నిర్వహించడం ఆనవాయితీ. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్‌లో చేరిన పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి తదితరులు హాజరయ్యారు.

# గణపతి బప్పా ఏందయా.!



గణపతి బప్పా వచ్చాడు పోయాడు. అందరికీ సందడి, సందడి. కొందరికేమో వ్యాపారం, ఇంకొందరికి రాజకీయం. ఏమైతేనేం అందరి కోర్కెలూ తీర్చిపోయాడని చాలామంది అనుకుంటున్నారు. ఆ కోర్కెలు ఏమిటన్నవి ఎవరికి వాళ్ళకు తెలుసు. సర్వ మతాల మధ్య సఖ్యత కోసం లోకమాన్యుడు మొదలు పెట్టిన ఈ గణపతి ఉత్సవాలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభించారు. తరువాత అవి వివిధ రకాలుగా మారిపోయి ప్రస్తుత రూపాన్ని సంతరించుకున్నాయని కొందరంటే ఈ విధంగా అఘోరించాయని ఇంకొందరనొచ్చు. పదాలు వేరే కాని అర్థం ఒకటేనని గమనించాలి మనం. రాజకీయాల్లోలా కాకుండా జమిలిగా చేసే ఈ ఉత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటారు. ఒక తలపై రూమి టోపి, ఒక తలపై గాంధి టోపి, క్యా భాయ్ అని అంటాడొకడు, ఏమోయని అంటాడొకడు అని సినారె ఎప్పుడో రాశారు. మతాలు, భాషలు వేరైనా మనమంతా భాయీ భాయీ అన్నాడు. ఈ భాయీల మధ్య చిచ్చు పెట్టేవారు కొందరైతే అన్న రామారావు లాంటి వాళ్ళు ఇంకా కొంతమంది అభ్యుదయవాదులు వారి మధ్య స్నేహాన్ని పెంచారు. విమోచన దినమా, స్వాతంత్ర్యదినమా అని పోట్లాడుకునే సమయంలోనే ఈ వినాయకచవితి వస్తుంటుంది. వినాయక నిమజ్జనానికి ఎవరికిష్టమైన పేరు వాళ్ళు పెట్టలేదని ఒక్కోసారి ఆనందపడుతుంటారు కొందరు. లేదంటే పాపాలను విమోచన చేస్తాడని కొందరు, లేదూ పాపాత్ముల నుండి స్వేచ్ఛ తెస్తాడని కొందరు ఇలా ఎవరికి అవసరమైనది వాళ్ళు చెప్పొచ్చు. అసలు నల్లగొండ నుండి బయలుదేరిన అరుణవీరుల వల్ల తెలంగాణ విముక్తి పొందిందని, అదే పోరాట స్ఫూర్తిని కలిగించిన అంశమని ఈ ఇద్దరూ చెప్పరు. జంట నగరాల్లో ప్రజలు సఖ్యతగా ఉన్నారంటే సెక్యులర్ శక్తులన్నింటి పాత్ర ఉందని గమనించాలి. ఇక పంచ భూతాల గురించీ తెలుసుకోవాలి మనం. అంటే ఐదు భూతాలు అని అనుకునేరు. గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్ని ఇవన్నమాట లెక్క ప్రకారం. ఎవరి లెక్క అంటే దానికి పెద్ద స్టోరీ ఉంది. అందుకే ఆ ఐదు భూతాలు ఏమిటి అనే వరకే మన పని. విషయానికొస్తే ఈ పంచ భూతాలను కొన్ని భూతాలు గణపతి బప్పా పేరు పెట్టుకొని కాలుష్యం చేస్తున్నారు. పేల్చే టపాకాయలు గాలి లోకి కాలుష్యాన్ని వెదజల్లడమే కాదు. గాలి ద్వారా పోయి చెవులను పాడు చేస్తున్నాయి. డిజె శబ్దాల గురించి చెప్పే పనే లేదు. ఈ శబ్ద కాలుష్యం చెవులనే కాదు మెదడును కూడా చెడగొడుతుందని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతూనే ఉన్నారు. ఎవరు వింటారు వాళ్ళ మాటలు చెప్పండి? నీరు రకరకాల రూపాల్లో దర్శనమిస్తుంది ఈ వినాయక నిమజ్జనాల సందర్భంగా. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలు, రంగులు కలిపి తయారు చేసిన బొమ్మలు నీటిని ప్రమాదంలో పడేస్తున్నాయి. దీనివల్ల నీటిలో కాలుష్యం పెరిగి అది భూమిలోకి ఇంకిపోవడమే కాకుండా గాలిలో కూడా మార్పులు తెస్తుంది. ఎండలో వచ్చిన మినరల్ వాటర్ బాటిళ్ళు, కూల్ డ్రింకు సీసాలు నీటినే కాదు గాలిని, భూమిని, ఆకాశాన్ని చివరికి మనుషుల ఆరోగ్యాల్ని పాడు చేస్తున్నాయి. ఇక యువతకు మందుబాటిళ్ళు ఇస్తున్నారు కదా. వాటిలోనూ నీళ్ళే కదా, ఇంకో రూపంలో. ఇక చెత్తను ఎక్కడికో తీసుకుపోయి పారేసే బదులు, కాల్చేస్తే సులభం కదాని ఆ పని చేస్తున్నారు కొందరు. ఆ విధంగా అగ్నిని వాడి చేస్తున్న కాలుష్యం ఆకాశానికి చేరి అక్కడ ఓజోన్ పొరను దెబ్బ తీస్తుంది. ఊరకే ఎండలు, కుండపోత వర్షాలు, క్లౌడ్ బర్స్టింగులు, వరదలు ఇలాంటి వాటి వెనుక మానవుడు చేస్తున్న కాలుష్యం మనం చూడొచ్చు. సంబురాలు చేసుకునే ప్రతి విషయాన్నీ చేసుకోవాల్సిందే. తప్పు లేదు. ఆ సంబురాల్లో జనం కావాలి, జనం రావాలంటే మొదట వారు ఆరోగ్యంగా ఉండాలి. భక్తి పారవశ్యంలో పంచభూతాల మీద భక్తిని కూడా చాటాలి. పొద్దున లేచినప్పటి నుండీ పంచభూతాలను పూజించేవాళ్ళు ఇంత ముఖ్యమైన విషయాన్ని ఎలా మరచిపోయారో అర్థం కాదు. నిజంగా తమ చుట్టూ ఇంతగా నష్టం జరుగుతున్నట్టు నాయకులందరికీ తెలుసు కాని వినాయకుడికి తెలియదు. తెలిసే అవకాశమూ లేదు. పర్యావరణ ప్రేమికులకు తెలిసినా వాళ్ళ మాట వింటున్నట్టు నటిస్తారే కాని ఎవ్వరూ వినరు. అందుకే గణపతి బప్పా ఇది ఏందయా అని అడగాలనుంది.

# అంతరిక్ష పరిశోధనకు భారీ ప్రోత్సాహం



కేంద్ర కేబినెట్ గగన్‌యాన్, చంద్రయాన్ మిషన్ల విస్తరణకు అత్యధికంగా నిధులు కేటాయిస్తూ ఆమోదించడం భారత అంతరిక్ష పరిశోధనలో ఒక ముందడుగు. రూ. 2,104 కోట్లతో చేపట్టే చంద్రయాన్ 4 ద్వారా 2040 నాటికి చంద్రుని పైకి భారతీయ వ్యోమగాములను పంపించి అక్కడి మట్టిని, శిలలను పరిశోధన కోసం భూమిపైకి తీసుకురావాలన్నదే ఈ మిషన్ లక్ష్యం. భూమి దిగువ కక్షలో 30 టన్నుల పేలోడ్‌లను ఉంచేలా 'తదుపరి తరం లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) 'సూర్య' అభివృద్ధికి రూ. 8,240 కోట్లు ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. ఇస్రో లాంచ్ వెహికల్ మార్క్ 3 కంటే మూడు రెట్లు అధికంగా పేలోడ్‌ను ఇది మోసుకెళ్లగలదు. మార్క్3 తో పోలిస్తే ఖర్చు మాత్రం కేవలం 50 శాతమే పెరుగుతుంది. ఇదే విధంగా వీనస్ ఆర్బిటర్ మిషన్ ద్వారా శుక్రగ్రహాన్ని అధ్యయనం చేయనున్నారు. దీని కోసం రూ. 1,236 కోట్లు కేటాయించారు. చంద్రయాన్4 మిషన్‌కు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీనే ఉపయోగిస్తారు. చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంతో చంద్రయాన్ 4ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అంతరిక్షంలో సొంతంగా 'భారతీయ అంతరిక్ష కేంద్రం' నిర్మించుకోవాలన్న ఆసక్తిని చూపిస్తోంది. గగన్‌యాన్‌లో భాగంగా 2028 డిసెంబర్ నాటికి ఎనిమిది మిషన్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుంది. గగన్‌యాన్‌కు రూ. 20,193 కోట్లు కేటాయించింది. ఈ కార్యక్రమం విస్తరణ కోసం అదనంగా రూ. 11,170 కోట్లు కేటాయించింది. ఇంత ప్రాధాన్యం ఇవ్వడం భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఇదే మొదటిసారి. అంతరిక్ష పరిశోధనలో మన దేశం అనేక విజయాలు సాధించగలిగింది. ఒకేసారి అనేక ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టిన ఘనతను కూడా సాధించింది. మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్ట నిర్మాణం నుంచి ఎన్నో ఉపగ్రహాలను రూపొందించింది. 2014 లో మంగళయాన్ ద్వారా కుజ కక్షలోకి ఉపగ్రహాన్ని పంపించగలిగింది. 2016 లో సెప్టెంబర్‌లో ఒకే రాకెట్ ద్వారా అనేక ఉపగ్రహాలను రెండు వేర్వేరు కక్షల్లో ప్రవేశపెట్టింది. 2017లో ఒకే యాత్రలో 104 ఉపగ్రహాలను భారత్ అంతరిక్షంలోకి ప్రవేశపెట్టగలిగింది. ఈ విధంగా చేసిన మొట్టమొదటి ఆసియా దేశంగా ఖ్యాతి సాధించింది. 2008 అక్టోబర్ 22న ప్రయోగించిన చంద్రయాన్ 1 చంద్రుడి ఉపరితలానికి 100 కిలోమీటర్ల దూరంలోని ఆ గ్రహ కక్షలో పరిభ్రమిస్తూ చేపట్టిన పరిశోధనలో చంద్రునిపై నీరు ఉన్నట్టు వెల్లడించింది. అయితే రెండేళ్ల పాటు చంద్రభ్రమణం చేయడానికి ఆ యాత్ర సంకల్పించినప్పటికీ, ఆ వ్యోమనౌకతో భూమికి సంబంధాలు తెగిపోవడంతో ఏడాదికే దాని చరిత్ర ముగిసిపోయింది. 2019 జులై 22 న చంద్రయాన్ 2 చంద్రుని పైకి దూసుకు వెళ్లినా పాక్షికంగా విఫలమైంది. ఆ ఏడాది సెప్టెంబరు 7 న చంద్రుడిపైకి దిగే సమయంలో దాని ల్యాండర్ భూమితో సంబంధాలను కోల్పోయింది. అయితే చంద్రయాన్ 3 మాత్రం విజయవంతమై దీనిని సాధించిన నాల్గవ దేశంగా భారత్ విశేష ఖ్యాతిని సాధించుకుంది. భారత్ కన్నా ముందు అమెరికా, రష్యాలు చంద్రుడి మీదకు విజయవంతంగా వెళ్లగలిగాయి. మొట్టమొదటిసారిగా అమెరికా నుంచి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1969లో చంద్రుడిపై కాలు మోపగలిగారు. చంద్రుని ఉపరితలంపై కొన్ని గంటలు ఆయన నడవగలిగారు. ఆయనే కాకుండా మరికొంతమంది అమెరికన్ వ్యోమగాములు చంద్రుడిపై వెళ్లగలిగారు. చైనా, రష్యాలు భారీగా వెచ్చించి చంద్రయాత్రలను చేపట్టగా, భారత్ మాత్రం పరిమిత వ్యయంతోనే చంద్రయాన్ 3 యాత్రను విజయవంతం చేయడం ప్రత్యేకించి చెప్పుకోదగిన విశేషం. ఎంతో పటిష్ఠంగా నిర్మించిన ఎల్‌విఎం 3 ఎం4 రాకెట్ చంద్రయాన్ 3 ని భూకక్షలో విజయవంతంగా చేర్చగలిగింది. చిమ్మచీకటిలో ఉండే చంద్రగ్రహ దక్షిణ ధ్రువంలోని ప్రత్యేక లక్షణాలపై పరిశోధనలు చేపట్టింది. ఇదే స్ఫూర్తితో ఇప్పుడు చంద్రయాన్ 4 మిషన్‌కు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. చంద్రుడిపై అత్యంత విలువైన ఖనిజ వనరులు ఉన్నాయని అమెరికా, చైనా దేశాలు చెబుతున్నాయి. చంద్రుని అవతలి వైపు పరిశోధనలు సజావుగా చేపట్టిన చైనా 2030 నాటికి మనుషులతో కూడిన అంతరిక్ష నౌకను చంద్రుడిపైకి పంపిస్తానని ప్రకటించింది. భారత్ దేశం కూడా అంతరిక్ష పరిశోధనల్లో తన సామర్థ్యాలు ఏమాత్రం తక్కువ కావని ఇస్రో అనేక సార్లు నిరూపించింది. ఇప్పుడు చంద్రయాన్ 4 విజయవంతమైతే ప్రపంచ అంతరిక్ష పరిశోధనల దేశాల సరసన భారత్ నిలబడగలుగుతుంది. అందుకనే ఈసారి కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలకు భారీగా నిధులు కేటాయించింది. నిధులు కేటాయించడమే కాదు కొన్ని లక్ష్యాలను నిర్దేశించింది. స్వయం సామర్థ్యంతో ఈ మిషన్లు చేపట్టడం మన దేశానికి గర్వకారణం.


# 'వికసిత్' లక్ష్యానికి విద్వేషాల తూట్లు



వికసిత్ భారత్‌ను 2047 నాటికి సాధించగలమని మోడీ ప్రభుత్వం చెబుతోంది.ఈ నేపథ్యంలో అన్ని వర్గాల సామాజిక సంస్కృతులను, వారి జీవన వ్యవహారాలను సమానంగా ఆదరించకపోతే వికసిత్ భారత్ లక్షానికి చేరుకోవడం ఎలా సాధ్యం అన్నదే ప్రశ్న. మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఆకాశహర్మ్యాలు, నేషనల్ హైవేలు, వందే భారత్‌లు ఇవేనా వికసిత్ భారత్ అంటే.. వీటి నుంచి సాధించిన జిడిపియేనా వికసిత్ భారత్ అంటే!.. దేశంలోని అన్ని కులాలను, మతాలను కలుపుకునే సమానత్వ సోదరత్వ భావాలను పాదుకొలిపిననాడే వికసిత్ భారత్ లక్షం వికసిస్తుంది. కానీ దేశంలో వర్గాలవారీగా, కులమతాల వారీగా విద్వేషాలు, హింసాత్మక సంఘటనలు గత కొన్నేళ్లుగా పెచ్చరిల్లుతున్నాయి. వీటిని ప్రభుత్వాలు ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి. గోరక్షణ పేరుతో కొంతమంది దుండగులు హింసాత్మక దాడులకు పాల్పడుతున్నా బాధితులకు న్యాయం సరిగ్గా జరగడం లేదు. గత నెల మహారాష్ట్రలో రైలులో వెళ్తున్న అష్రఫ్ అలీ సయ్యద్ హుస్సేన్‌ను బీఫ్ (గొడ్డు మాంసం) తీసుకెళ్తున్నాడని ఒక గుంపు విపరీతంగా దాడిచేసింది. మరో కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన 22 ఏళ్ల సబీర్ మాలిక్ గోమాంసం విక్రయిస్తున్నాడని హర్యానాలోని చరీ?దాద్రి జిల్లాలో గోరక్షకులు దాడిచేశారు. అదే కారణంతో హర్యానాలోని జాతీయ రహదారిపై 19 ఏళ్ల ఆర్యన్ మిశ్రాను ముస్లింగా, పశువుల దొంగ గా అనుమానించి గోరక్షకులు కాల్చిచంపారు. ఈ కేసులో హర్యానా పోలీస్‌లు ఐదుగురిని అరెస్టు చేసినప్పటికీ పొరపాటున తాము అరెస్టు చేశామని చెప్పివారిని విడిచిపెట్టారు. ఉత్తరప్రదేశ్ లోని అమ్రోహాలో ఒక విద్యార్థి నాన్‌వెజిటేరియన్ బిర్యానీ తెచ్చుకున్నాడని ఆ స్కూలు ప్రిన్సిపాల్ ఆ విద్యార్థికి శిక్ష విధించాడు. బాధితుడైన విద్యార్థి తల్లి తన కుమారుడిని చితకబాది గదిలో మూడు నాలుగు గంటలు బంధించి చివరకు విడిచిపెట్టారని ఆరోపించింది. కానీ దీనికి తగిన సాక్షాధారాలు లేవని పోలీస్‌లు చేతులు దులుపుకున్నారు. 2016లో పశువుల కాపరులైన ఇద్దరు ముస్లింలను మార్కెట్‌కు పశువులను తీసుకెళ్తుండగా హింసించి చంపారు.వీరిలో ఒక కుర్రాడు జార?ండ్‌లోని లతేహార్ జిల్లా మారుమూల గ్రామస్థుడు. హర్యానాలో చార్కిదాద్రి జిల్లాలో వలస కార్మికుడు సబీర్ మాలిక్‌ను చచ్చేంతవరకు హింసించారన్న ఆరోపణపై పోలీస్‌లు ఐదుగురిని అరెస్టుచేశారు. ఒడిశాలోని ఒక కాలేజీ హాస్టల్‌లో బీఫ్ వండారని ఏడుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్ హాస్టల్ నుంచి బహిష్కరించారు. ఇలాంటి దారుణాలు వికసిత్ భారత్ లక్షం గల భారత్‌లో కొనసాగుతుండడం శోచనీయం. హిందువులు గోవులను ఆరాధిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. గోవధను గోమాంస క్రయవిక్రయాలను చాలా రాష్ట్రాలు నిషేధించాయి కూడా. కానీ గోరక్షణ పేరుతో హత్యలకు పాల్పడడమే ఘోరాతిఘోరమైన నేరం. గోవులను రక్షిస్తున్నామని చెప్పి హత్యలను సాధారణం చేసిన దేశం.. ప్రజాస్వామ్యం అన్న నినాదాన్ని ఎలా ఇవ్వగలుగుతుంది? గోరక్షణ పేరుతో సాటి మనిషిని హతమార్చడం హిందుత్వకు వ్యతిరేకమని సాక్షాత్తు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ ఒకసారి ప్రస్తావించడం గమనార్హం. 201017 మధ్యకాలంలో దేశంలో గోరక్షక దళాలు 63 సార్లు హింసాత్మక దాడులకు పాల్పడ్డాయని రాయిటర్స్ సంస్థ నివేదిక వెల్లడించింది. ఈ దాడుల్లో సగం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయి.కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ఏడేళ్లలోనే జరిగిన గోదాడుల్లో మృతి చెందిన 28 మందిలో 24 మంది ముస్లింలేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడుల్లో సగానికి సగం కేవలం వదంతుల పైనే జరిగాయని తేలింది. ఏ సమాజం లేదా ఏ ప్రజల ఆహారంలోనైనా వారి ఎంపికను ఏ విధంగా ద్వేషిస్తాం? ఆహారం అన్నది వ్యక్తిగతమైన అవకాశం. జనాభాలో 90 శాతానికి పైగా ముస్లింలే ఉన్న లక్షద్వీప్‌లో జంతువధను నిషేధించడం ఆ వర్గం ఆహారాన్ని లక్షంగా చేసుకొని తీసుకున్న చర్య కాదా? ఇండోనేషియా, మలేషియాలను ఉదాహరణగా తీసుకుందాం. ఆగ్నేయాసియాలోని ఈ రెండు దేశాల్లో ముస్లింల జనాభాయే మెజారిటీ సంఖ్యలో ఉంటారు. ముస్లింలు సంప్రదాయంగా పోర్క్‌ను తీసుకోరని ప్రతివారికీ తెలుసు. అక్కడ పోర్కును తినవద్దని మైనార్టీలనుగాని, టూరిస్టులనుగాని ఎవరూ అడ్డగించరు. రెస్టారెంట్లలో పోర్క్‌పై ప్రకటనలు ఉన్నా ఎవరూ నిరోధించరు. నేషనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ సర్వే ప్రకారం 2019లో 47% మంది భారతీయులు వారానికి ఒకసారి మాంసాహారం తీసుకుంటారని బయటపడగా, ఇప్పుడు 57% మంది మాంసాహారం తీసుకుంటారని తేలింది. మరి మాంసాహారం తినవద్దని హిందువులమైన మనం శాసించగలమా ?




# దేవర రిలీజ్ ట్రైలర్.. సముద్రం మీద ఒక దేవర



ఆర్ఆర్ఆర్ తర్వాత టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న దేవర పార్ట్-1పై ఎలాంటి అంచనాలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మాస్ డైరెక్టర్ కొరటాల శివ తెరకెక్కిస్తున్న ఆ సినిమా కోసం వేయి కళ్లతో ఫ్యాన్స్ తో పాటు వరల్డ్ వైడ్ గా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్నారు. మూవీలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. మరో బీటౌన్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ విలన్ గా సందడి చేయనున్నారు. మరికొద్ది రోజుల్లో దేవర రిలీజ్ కానుండడంతో మేకర్స్ పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేపడుతున్నారు. వేరే లెవెల్ లో బజ్ క్రియేట్ చేస్తున్నారు. పక్కా ప్లాన్ తో అదిరిపోయే పోస్టర్లను రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే మూడు సాంగ్స్ ను విడుదల చేయగా.. అన్నీ కూడా చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. ఇటీవల సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. అంచనాలు భారీగా పెరిగిపోయాయి. మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అని అంతా ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు మూవీపై అంచనాలు.. ఆకాశాన్ని తాకేలా రిలీజ్ ట్రైలర్ ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. పవర్ ఫుల్ డైలాగ్స్ తోపాటు అబ్బురపరిచే యాక్షన్ సీన్స్ తో కొత్త ట్రైలర్ సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. ఫ్యాన్స్ ఏది కోరుకున్నారో.. అంతకు మించి పోయేలా ట్రీట్ ఇచ్చారు మేకర్స్. మూవీ కచ్చితంగా చూడాలనే విధంగా రిలీజ్ ట్రైలర్ ను కట్ చేశారు. 'నిన్న రేత్రి ఓ పీడకల వచ్చుండాది జోగుళ.. సంద్రం ఎరుపెక్కి నిజంగా ఎర్ర సముద్రం అయినట్లు, అది నా చేతుల మీద అయినట్లు కనిపించుండాది' అంటూ ఎన్టీఆర్ గంభీరమైన వాయిస్ తో ట్రైలర్ ప్రారంభమైంది. 'భయం పోవాలంటే దేవుడి కథ ఇనాలా...భయమంటే ఏంటో తెలియాలంటే దేవర కథ ఇనాలా.. సముద్రం మీద ఒక దేవర ఉన్నాడు చాలు..' అన్న డైలాగ్స్ ఇంట్రెస్ట్ పెంచేశాయి. ట్రైలర్ చివర్లో మేకర్స్ చూపించిన తారక్ డ్యాన్స్, యాక్షన్ సీన్స్ అదిరిపోయాయి. విజువల్స్ తోపాటు సముద్రం బ్యాక్ డ్రాప్ లో వచ్చిన సీన్స్ ఆకట్టుకున్నాయి. అనిరుధ్ రవిచందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మెయిన్ అసెట్ గా మారింది. జాన్వీ కపూర్ తన లుక్స్ తో ఎట్రాక్ట్ చేసింది. కొరటాల శివ మార్క్ క్లియర్ గా కనిపించింది. సినిమాలో ఎన్టీఆర్ నట విశ్వరూపం చూడనున్నామని మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. మరి సెప్టెంబర్ 27వ తేదీన రిలీజ్ కానున్న మూవీ ఎలా ఉంటుందో చూడాలి.

# రష్మికలో ఈ కొత్త కోణం చూశారా?



పుష్పలో శ్రీవల్లిని, గీత గోవిందంలో గీతను అంత తేలిగ్గా మర్చిపోగలరా? అలాగే ఇప్పుడు మిలన్ ఫ్యాషన్ వీక్ 2024లో రష్మిక మందన లుక్స్ ని మర్చిపోవడం కూడా కుదరదు. ఇదిగో అందుకు ఎగ్జాంపుల్ ఈ కొత్త ట్రెండీ లుక్. కావాలంటే మీరే చూడండి. రష్మికను ఇలా కొత్తగా ట్రెండీగా చూడడం ఇదే మొదటి సారి కాకపోవచ్చు.. కానీ ఈసారి తనలో రెబలిజం హద్దుమీరింది. పాశ్చాత్యధోరణి పరాకాష్టలో కనిపిస్తోంది. అయితే దీనికి కారణం లేకపోలేదు. అది డిజైన్ చేసింది పాశ్చాత్య డిజైనర్ కాబట్టి.. అందుకు సంబం ధించిన మూలాలు ఈ డిజైనర్ డ్రెస్ లో ఉన్నాయి. రష్మిక మందన్న మిల న్లో ప్రజలకు మత్తెక్కిస్తోంది. అక్కడ ఫ్యాషన్ ఈవెంట్లలో ఈ భామ చాలా సరదాగా గడుపుతోంది. శనివారం మిలన్ ఫ్యాషన్ వీక్ ఆఫ్టర్ పార్టీకి రష్మిక హాజరయ్యారు. ఈ సందర్భంగా రష్మిక ధరించిన స్పెషల్ డ్రెస్ ఈవెంట్ కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందరిలోను రష్మిక షో స్టాపర్ గా నిలిచింది. ఇంతకీ దీనిని డిజైన్ చేసినది ఎవరు? అంటే రష్మికతో పాటు ఫోటోల్లో కనిపించిన ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్ %-%డోనాటెల్లా వెర్సాస్%-%. వెర్సాస్ ప్రస్తుత చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ అయిన డోనాటెల్లా, రష్మిక సహా ప్రపంచం నలుమూలల నుండి ప్రముఖులు ఈ ఆఫ్టర్ పార్టీలో పాల్గొనగా..స్పాట్ లో రష్మిక హైలైట్ అయింది. రష్మిక అద్భుతమైన ఐవరీ బ్లేజర్ డ్రెస్, గ్లామ్ మేకప్‌లో కనిపించింది. డోనాటెల్లా తన ప్రక్కనే ఉండి నవ్వుతూ పోజులిచ్చింది. షేర్ అయిన ఫోటోల రంగులరాట్నంలో హ్యుంజిన్, నార్మానీ, జిగి హడిద్, గియాకోమో జార్జియో, బీట్రైస్ వెంగ్రామిన్, నవా మౌ , డెనిస్ కాపెజ్జా, జీన్ గల్లాఘర్ లాంటి ప్రముఖులు ఉన్నారు. డోనాటెల్లా టైమ్‌లైన్‌లో రష్మిక పోస్ట్ ని చూసి దక్షిణాది సినీప్రియులు సంతోషించారు. %--%నేను ఆమెకు అభిమానిని కాదు కానీ తన గురించి చాలా గర్వపడుతున్నాను. ఆమె ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చింది. మోడలింగ్ చేసింది.. సినిమాల్లో నటించడానికి ప్రయత్నించింది. చాలా అనవసరమైన ద్వేషాన్ని ఎదుర్కొంది. కానీ ఆమె పట్టించుకోలేదు. చాలా భాషలు నేర్చుకుంది. నటనలో కష్టపడి ఇప్పుడు ఈ స్థాయికి ఎదిగింది. అన్నింటికీ తన కష్టమే కారణం. ఆమె సాధించడానికి ఇంకా చాలా మంచి విషయాలు ఉన్నాయని అనుకుంటున్నాను. నేను ఆమెకు మంచి జరగాలని కోరుకుంటున్నాను.. అని రెడ్డిట్‌లో ఒక వ్యక్తి రాశాడు. ఈ అమ్మాయికి ఆకాశమే హద్దు%ౕ%అని ఒకరు రాసారు. కొరియన్ల మధ్య భారతీయతను రష్మిక ఆవిష్కరించిందని ఒకరు ప్రశంసించారు. రష్మిక రెబలిజం హద్దు మీరుతోంది అంటూ ఒక ఫ్యాషన్ ప్రియుడు సరదాగా వ్యాఖ్యానించారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... విక్కీ కౌశల్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చారిత్రాత్మక చిత్రం %-%ఛావా%-%లో రష్మిక కనిపించనుంది. తదుపరి ధనుష్- నాగార్జున అక్కినేనితో కలిసి %-%కుబేర%-%లోను కనిపించనుంది. ది గర్ల్‌ఫ్రెండ్ లో ధీక్షిత్ శెట్టితో స్క్రీన్‌ను పంచుకుంటుంది. డిసెంబరు 6న థియేటర్లలో విడుదల కానున్న %-%పుష్ప: ది రూల్%-% సినిమా కోసం అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# మమ్మీ అయినా డోంట్ కేర్.. రివీలింగ్ బ్లౌజ్‌లో చెలరేగిన శ్రీయ!

గత కొంతకాలంగా శ్రీయ కోశ్చీవ్ ఫోటోషూట్లు అంతర్జాలంలో దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాతా ఈ భామ హద్దులు చెరిపేసి చెలరేగిపోతోంది. భర్త కోశ్చీవ్ తో పబ్లిక్ లోనే హగ్గులు, కిస్సులతో రెచ్చిపోతున్న శ్రీయ, ఫోటోషూట్ల విషయంలో దుమ్ము దులిపేస్తోంది. ఇలా అయితే లాభం లేదు. నేటితరంతో పోటీపడాలంటే తాడో పేడో తేల్చాల్సిందే అన్నట్టుగా ఉంది శ్రీయ వ్యవహారం. తాజాగా శ్రీయ మరోసారి తనదైన శైలిలో ఫోటోషూట్ లో రివీలింగ్ డ్రెస్ లో చెలరేగిపోవడం హాట్ టాపిక్ గా మారింది. శ్రీయ బ్లౌజ్ ఊహించిన దానికంటే స్పైసీగా డిజైన్ చేయడం ఇక్కడ గమనించదగినది. ఇది రొటీన్ కి భిన్నంగా తన ఇన్నర్ అందాలను ఒక రేంజులో ఎలివేట్ చేస్తోంది. సీనియర్ బ్యూటీ తగ్గేదేలే అన్నట్టుగా చెలరేగిపోయింది. శ్రియా శరణ్ దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో అత్యంత పాపులర్ నటీమణులలో ఒకరిగా వెలుగుతోంది. పెళ్లి తర్వాతా ఈ భామ ఫైన్ అవుతున్న తీరు నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. శ్రీయ కంటే చాలా ఆలస్యంగా వచ్చి కనుమరుగైన చాలా మంది భామలతో పోలిస్తే ఇప్పటికీ అదే గ్లామర్ తో దుమ్ము రేపుతోంది. ఫ్యాషన్ ఐకాన్‌గా శ్రియా శరణ్ తనను తాను ఆవిష్కరించుకుంటున్న తీరు ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవలే SIIMA బిజినెస్ అవార్డ్ నైట్ ఈవెంట్‌కు హాజరైనప్పుడు గుబులు రేపే లుక్ తో కనిపించింది. ఇంతలోనే ఇప్పుడు టూమచ్ రివీలింగ్ డ్రెస్ లో దుమారం రేపింది. దీనికి ఒక నెటిజన్ స్పందిస్తూ %-%మిరుమిట్లుగొలిపే అందం%-% అని ప్రశంసించారు. శ్రియా శరణ్ చివరిగా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రీమియర్ అయిన హిందీ సిరీస్ %-%షోటైమ్%-%లో కనిపించింది. మిహిర్ దేశాయ్ - అర్చిత్ కుమార్ దీనికి దర్శకత్వం వహించారు. తారాగణంలో నసీరుద్దీన్ షా, ఇమ్రాన్ హష్మీ, మహిమా మక్వానా, మౌని రాయ్, రాజీవ్ ఖండేల్‌వాల్, శ్రియా శరణ్, విశాల్ వశిష్ఠ వంటి పేర్లు ఉన్నాయి. ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, సోమెన్ మిశ్రా , మిహిర్ దేశాయ్ ఈ షోను నిర్మించగా, ఆనంద్ భాస్కర్ సంగీతం అందించారు. తదుపరి తన ప్రాజెక్టుల గురించి ప్రకటించాల్సి ఉంది.



# చీరందంలో శోభిత.. ఎంత అందంగా అంటే?





తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎంత మంది తెలుగు హీరోయిన్లు ఉన్నా శోభిత మాత్రం టాలీవుడ్ ని దాటి బాలీవుడ్ కి దూసుకెళ్లిన నటి. ట్రెండ్ కి తగ్గట్టు తనని తాను మౌల్డ్ చేసుకుంటూ నార్త్ బ్యూటీలకు ఏమాత్రం తక్కువ కాదని ప్రూవ్ చేస్తుంది. ఆ రకంగా ట్రెండ్ ని ఫాలో అవుతుంది కాబట్టే ఆ రేంజ్ లో ఫాలోయింగ్ దక్కించుకుంది. అందుకే ఇప్పుడు అక్కినేని నాగచైతన్యని ప్రేమ వివాహం చేసుకుంటుంది. శోభిత పుట్టింది తెనాలి అయినా! పెరిగింది అంతా విశాఖ పట్టణంలోనే. చిన్న నాటి నుంచి నార్త్ కల్చర్ కి అలవాటు పడిన బ్యూటీ. మోడ్రన్ కల్చర్ లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఆమె ఆలంకరణ..దుస్తులు ఎంపిక ప్రతీది నార్త్ బ్యూటీని తలపిస్తుంది. తెలుగు సంప్రదాయంలో కనిపించడం అన్నది చాలా రేర్. వీలైనంత వరకూ అల్ట్రా మోడ్రన్ దుస్తుల్లో కనిపించడానికే ఎక్కువగా ఇష్టపడుతుంది. మరి ఇది చైతన్య తెచ్చిన మార్పా? తనలో కలిగిన మార్పా? అన్నది తెలియదు గానీ..తాజాగా శోభిత సంప్రదాయ చీరందంలో తళుక్కున మెరిసింది. ఇదిగో ఇక్కడిలా క్రీమ్ సారీ మ్యాచింగ్ బ్లౌజ్ లో ఎంతో అందంగా కనిపిస్తుంది. డిజైనర్ చెవులీలు...చేతికి మ్యా ఎంపిక చేసుకున్నచింగ్ యాక్సరసీస్...మ్యాకప్ ఇతర అలంకరణ ప్రీతీది శోభితని ఎంతో అందంగా తీర్చి దిద్దాయి. నుదిటిన ఎరుపు వర్ణం చిన్న బొట్టు మరింత ఆకర్షణీయంగా ఉంది. అన్నిక్లోజప్ షాట్స్ లోనూ వివిధ భంగిమల్లో శోభిత ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక శోభిక కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. క్రేజీ ప్రాజెక్ట్ ల్లో అవకాశాలు అందుకుంటుంది.